రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం

● కలెక్టర్ శివశంకర్



మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 3: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రెవెన్యూ సదస్సుల నిర్వహణ ద్వారా గ్రామాల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు చక్కటి పరిష్కారం దొరుకుతుందని కలెక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ సదస్సుల ప్రణాళిక, కార్యాచరణపై జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డీఆర్వో గంగాధర్‌గౌడ్‌తో కలసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారం కోసం త్వరలో రెవెన్యూ సదస్సుల నిర్వహణకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. నిర్ణయించిన తేదీల్లో నిర్దేశించిన గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు. గ్రామ రెవెన్యూ సిబ్బంది ముందుగానే ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. రెవెన్యూ సదస్సుల్లో మ్యుటేషన్లు, భూ వివాదాలు, భూ ఆక్రమణలు, 22(ఏ) దుర్వినియోగం, ఫ్రీహోల్డ్ భూములు తదితర వాటిపై గ్రామస్తుల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు. అర్జీలు స్వీకరించిన వెంటనే రశీదులు ఇస్తారని, అదే రోజు ఆన్‌లైన్‌లో నమోదు చేసి 40 రోజుల వ్యవధిలో విచారణ చేసి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. రెవెన్యూ సదస్సులో గతంలో పార్టీ లోగోలతో జారీ చేసిన భూ హక్కు పత్రాలను సేకరించి కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలను అందజేస్తామన్నారు. రీ సర్వే పూర్తి అయిన గ్రామాల్లో ఆర్‌ఓఆర్, రిజిస్టర్‌ను చదివి అభ్యంతరాలు స్వీకరిస్తారని తెలిపారు. రెవెన్యూ సదస్సులకు హాజరయ్యే మండల సర్వేయర్ సంబంధిత విలేజ్ మ్యాపులను కచ్చితంగా తీసుకు రావాల్సి ఉంటుందన్నారు. ఈ రెవెన్యూ సదస్సుల్లో ఆర్డీవో స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఫారెస్ట్, దేవదాయ, పోలీసు అధికారులతో పాటు రిజిస్ట్రేషన్ అధికారులు, బ్యాంకర్లు, సహకార బ్యాంకు అధ్యక్షులు, అనుబంధ శాఖల అధికారులు హాజరవుతారన్నారు. గ్రామ స్థాయిలో సమస్యలను, మండల, డివిజన్ స్థాయిలో పరిష్కరిస్తారన్నారు. అక్కడ పరిష్కారం కాని సమస్యలను జిల్లా, రాష్ట్ర స్థాయిలో సమీక్షిస్తారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న జెడ్‌హెచ్‌డీసీ భూముల వివరాలను సేకరించి ఇప్పటివరకు ఆయా భూముల అనుభవదారులు ఏమైనా ప్రభుత్వ లబ్ధి పొంది ఉన్నారా? అనే అంశాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని ఆర్డీవోలను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవోలు శ్రీనివాసులు, వెంకటపతి, చంద్రమోహన్, వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని కలెక్టర్ శివశంకర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం గ్రీవెన్స్ హాల్లో మధ్యాహ్న భోజనం, తీసుకోవాల్సిన చర్యలపై విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీలతో ఒక్కరోజు వర్క్ షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ఏ విధంగా తయారు చేస్తున్నారు, టాయిలెట్స్ శుభ్రంగా ఉన్నాయా లేదా అని పేరెంట్స్ కమిటీలు పరిశీలించాలన్నారు. పాఠశాల ఆవరణలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. విద్యార్థులకు టైం విలువ తెలిసేందుకు ప్రతి ఒక్కరూ రిస్ట్ వాచ్ కట్టుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ఈ సమావేశంలో డీఈవో అనురాధ, డిప్యూటీ డీఈవో క్రిష్ణప్ప, రాజగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్లెలకు మహర్దశ



- రూ.220 కోట్లతో సీసీరోడ్లు, డ్రైన్స్
- రూ.12.15 కోట్లతో పశువులకు షెడ్లు
- జగన్ హయాంలో పల్లెసీమలు నిర్వీర్యం
- చంద్రబాబు రాకతో పల్లెలకు పూర్వ వైభవం
- నాడు సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాలు
- కూటమి ప్రభుత్వంలో కింగ్‌లు
- మళ్లీ పల్లెల్లో కాంతులు

(కడప- ఆంధ్రజ్యోతి): పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు. పల్లెలు అభివృద్ధి చెందితేనే దేశం కూడా అభివృద్ధి చెందుతుంది. దేశాభివృద్ధిలో పల్లెలపాత్ర కీలకం. అలాంటి పల్లెసీమలను జగన్ పాలనలో నిర్వీర్యం చేశారు. ఓ సచివాలయ భవనం కట్టేసి, 8 మంది సిబ్బందిని నియమించి బాపూజీ మహాత్మాగాంధి కలలను జగన్ సాకారం చేశారంటూ అప్పట్లో వైసీపీ నేతలు డబ్బా కొట్టుకునేవారు. పల్లెలు అభివృద్ధి చెందాలంటే వాటికి నిధులు ఇవ్వాలి. పల్లె అభివృద్ధికి ఏం అవసరమో గ్రామ సభల ద్వారా తీర్మానం చేసి ప్రాధాన్యతపరంగా వాటిని నిర్మించుకోవాలి. జగన్ హయాంలో రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడం మాట అటుంచితే.. కేంద్రం నుంచి ఇచ్చే ఆర్థిక సంఘాల నిధులనూ పక్కదారి పట్టించేసింది. అప్పట్లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ మార్కు బెదిరింపులతో సర్పంచుల్లో 90 శాతం దాకా ఆ పార్టీ మద్దతుదారులే ఉన్నారు. అయినా కూడా పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం పైసా ఇవ్వలేదు. రాష్ట్రానికి సీఎం కింగ్ అయితే పంచాయతీకి సర్పంచే కింగ్. అలాంటి పంచాయతీ వ్యవస్థను సమాంతర సచివాలయ వ్యవస్థ తీసుకుని వచ్చి డమ్మీ చేశారు. సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాలుగా మారారు. రాజ్యాంగబద్ధంగా వచ్చిన నిధులకోసం పోరాటం చేశారు. చెవిటోని ముందు శంఖం ఊదినట్లు.. సర్పంచ్‌ల ఆందోళన జగన్ చెవికెక్కలేదు. కూటమి ప్రభుత్వంతో పరిస్థితి మారింది. మళ్లీ ఇప్పుడు పల్లెలు కళకళలాడబోతున్నాయి. సుమారు రూ.235 కోట్ల వ్యయంతో పల్లెసీమల రూపురేఖలు మార్చే ప్రక్రియ మొదలైంది.

కూటమితో పల్లెలకు వసతులు

చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామ పంచాయతీలకు మహర్దశ పట్టుకుంది. ఇక డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఏరికోరి గ్రామీణాభివృద్ధి శాఖను తీసుకున్నారు. ఇప్పుడు సీఎం, డిప్యూటీ సీఎం ఇరువురూ కలిసి పల్లెల అభివృద్ధిపై దృష్టి పెట్టారు. వెరసి ఇప్పుడు పల్లెలు మళ్లీ పూర్వవైభవం సంతరించుకోనున్నాయి. ఉపాధి హామీ పథకం నిధులతో పల్లెల్లో మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టారు. స్వర్ణగ్రామ పంచాయతీ పేరుతో గ్రామాలను అభివృద్ధి చేయనున్నారు. ఇందులో భాగంగా ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు, కుళాయి కనెక్షన్లు, మరుగుదొడ్డి, వంట గ్యాస్, మురుగునీటి వ్యవస్థ, వీధి దీపాలు, ఘన వ్యర్థాల నిర్వహణ, అంతర్గత రోడ్లు, గ్రామాల నుంచి మండల కేంద్రాలకు రోడ్లు, వర్షంనీటి సంరక్షణ కోసం ఇంకుడుగుంతలు, పంట కుంటలు, పశువుల పెంపకం, వాటి షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గ్రామాల్లో ఏవేవి అవసరమో గుర్తించేందుకు గాను ఆగస్టు 23న రాష్ట్రవ్యాప్తంగా అన్నిచోట్లా గ్రామసభలు నిర్వహించి రికార్డు సృష్టించారు. జిల్లాలో 562 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. గ్రామానికి ఏం అవసరమో ప్రజల నుంచే అర్జీలు స్వీకరించారు. సర్పంచ్‌ల అధ్యక్షతలోనే సభ జరిగింది. ఎక్కడెక్కడ సిమెంటు రోడ్లు, డ్రైనేజీలు, పంట పొలాలకు రోడ్లు, మండల కేంద్రాలకు రోడ్లు, పల్లె అభివృద్ధికి ఏమేం కావాలో గుర్తించి వినతులు ఇచ్చారు. వాటిని గ్రామసభల ద్వారా ఆమోదించి తీర్మానం చేశారు.



దారి కూడా సరిగా లేని బి.కోడూరు మండలం గోవిందాపల్లె పంచాయతీ కార్యాలయం

సీసీ రోడ్లు, ప్రాధాన్యత పనులు

గ్రామాలను కూడా పట్టణాలకు దీటుగా అభివృద్ధి పథంలో నడిపించాలంటే అక్కడ తొలుత సిమెంటురోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో జిల్లాలో రూ.110 కోట్ల వ్యయంతో 47.కిమీ సిమెంటు రోడ్లు, అంతే వ్యయంతో 47 కి.మీ సీసీ రోడ్లు నిర్మించనున్నారు. వీటిని వచ్చే ఏడాది మార్చి నెలలోపు పూర్తి చేయాలన్నది లక్ష్యం. వంద రోజుల ప్రణాళికలో భాగంగా ఈ నెల 17లోపు 7 కి.మీ సిమెంటురోడ్లు, 7 కి.మీ డ్రైన్స్ నిర్మించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు పనులు జరుపుతున్నారు. మిగతా లక్ష్యాన్ని వచ్చే ఏడాది మార్చి చివరి నాటికి పూర్తి చేయనున్నారు. అలాగే రూ.12.5 కోట్లతో 875 పశువుల షెడ్లను నిర్మించనున్నారు. గొర్రెలు, మేకలు, ఇతరత్రా వాటి కోసం వీటిని నిర్మిస్తారు. ఇక అంతర్గత రోడ్లు, మండల కేంద్రాల్లో రోడ్ల నిర్మాణం, మిగతా పనులు ప్రాధాన్యతా క్రమంలో చేపట్టనున్నారు. ప్రతి ఇంటికి తాగునీటితో పాటు వంటగ్యాస్, విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలన్నదే లక్ష్యం. ఇక 2014-1019 టీడీపీ హయాంలో చెత్తతో సంపద తయారీ కేంద్రం షెడ్లు నిర్మించారు. వాటిని జగన్ ప్రభుత్వం గాలికి వదిలేసింది. మళ్లీ వాటిని ఉపయోగంలోకి తీసుకువచ్చి ఘన వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించాలని నిర్ణయించారు. మొత్తానికి కూటమి రాకతో పల్లెలకు మహర్దశ రానుంది. సర్పంచ్‌లు మళ్లీ కాలగరేసి తిరిగే రోజులు వచ్చాయి.



పోరుమామిళ్ల మండలం దమ్మనపల్లెలో రోడ్డు దుస్థితి

ఇసుక దందాకు పాల్పడితే కఠిన చర్యలు

- ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్‌కు సిఫారసు
- ఏటూరు ఇసుక రీచ్‌ను పరిశీలించిన ఆర్డీవో

కొండాపురం/వీరపునాయునిపల్లె, సెప్టెంబరు 3: ఎవరైనా ఇసుక దందాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జమ్మలమడుగు ఆర్డీవో శ్రీనివాస్ తెలిపారు. ఏటూరు ఇసుక రీచ్‌లో ఇసుక దందాపై ఆంధ్రజ్యోతిలో మంగళవారం 'వీళ్లు.. మారరంతే' పేరుతో కథనం ప్రచురితం అయింది. దీంతో మంగళవారం సాయంత్రం ఏటూరు ఇసుకరీచ్‌ను ఆర్డీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక అదనపు లోడింగ్‌కు డబ్బులు వసూలుచేసినా, ఇసుక అక్రమ రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గేటు వద్ద వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు రావడంతో ఇప్పటికే

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్‌కు సిఫారసు చేశామన్నారు. ఇసుక రవాణా పారదర్శకంగా జరగాలని అధికారులను ఆదేశించారు. రెండుమూడు రోజుల్లో ప్రభుత్వం వద్ద రిజిస్టర్ అయిన వాహనాలను మాత్రమే ఇసుక సరఫరాకు అనుమతిస్తామ న్నారు. ప్రస్తుతం కొండాపురం, తాళ్లప్రొద్దుటూరు సచివాలయాల వద్ద మాత్రమే ఇసుక బుకింగ్‌కు అవకాశం ఉందన్నారు. త్వరలో ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశ పెడుతోందని, దీనిద్వారా రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా ఇసుకను బుక్ చేసుకొనే అవకాశం ఉంటుంద న్నారు. ఈ సందర్భంగా ఇసుక రీచ్ వద్ద కూపన్లను ఆర్డీవో తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మాధవకృష్ణారెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ రాజేశ్వరమ్మ, ఆర్ఐ ఆనందరావు పాల్గొన్నారు.



కొండాపురం మండలం ఏటూరు ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న జమ్మలమడుగు ఆర్డీవో శ్రీనివాస్



వీఎన్‌పల్లె మండలం సంగమేశ్వరం వద్ద స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఏడీ రవిప్రసాద్ తదితరులు

ఇసుక స్టాక్ పాయింట్‌ను పరిశీలించిన మైనింగ్ ఏడీ

వీరపునాయునిపల్లె మండలం సంగమేశ్వరం సమీపంలోని ఇసుక స్టాక్ పాయింట్ వద్దఅధికార పార్టీ నాయకుల దందాపై మంగళవారం ఆంధ్రజ్యోతిలో కథనం రావడంతో అధికారులపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. దీంతో ఇసుక స్టాక్‌పాయింట్ వద్దకు మైనింగ్ ఏడీ రవిప్రసాద్, తహశీల్దార్ లక్ష్మిదేవి, ఆర్ఐ విమలమ్మ, ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి వెళ్లి పరిశీలించారు. ఏడీ రవిప్రసాద్ మాట్లాడుతూ స్టాక్ పాయింట్‌ను పరిశీలించామని, స్టాక్‌పాయింట్ వద్ద 156 టిప్పర్లు ఉన్నాయని అన్నారు. వాటికి లోడింగ్ చేయించి ఇక్కడ జరుగుతున్న విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి రెండు మూడు రోజుల్లో ఈ క్వారీపై నిర్ణయం తీసుకుంటామని అన్నారు. స్టాక్ పాయింట్ వద్దకు ఇసుక కోసం వినియోగదారులు రాలేదని, లోకల్ నాయకుల జోక్యంతో ఇసుక తరలిస్తున్నారని అన్నారు. స్టాక్ పాయింట్‌లో మిగిలి ఉన్న ఇసుకను హౌసింగ్‌కు వాడేలా నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

పలువురు పోలీసుల బదిలీ

కడప(క్రైం), సెప్టెంబరు 3: జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి స్థానచలనం కల్పిస్తూ ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లావ్యాప్తంగా ఐదేళ్లు పూర్తి చేసుకున్న 261 మందిని బదిలీ చేశారు. వీరిలో 44 మంది ఏఎస్‌ఐలు, 93 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 124 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. బదిలీఅయిన సిబ్బంది తమకు కేటాయించిన పోలీసుస్టేషన్లలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

శవాల కోసం జగన్ ఎదురుచూపులు

● టీడీపీ నేత గోవర్ధనరెడ్డి



కడప(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 3: క్రిష్ణ, గుంటూరు జిల్లాల్లో వరదలు వచ్చి అతలాకుతలం అవుతుంటే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శవాల కోసం ఎదురు చూస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.గోవర్ధనరెడ్డి తీవ్ర స్థాయిలో ఆరోపించారు. సొంత మీడియాలో రోత రాతలు మానుకోవాలని హితవు పలికారు. మంగళవారం కడప నగరంలోని బసవతారకం లా కళాశాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... శవాల మీద పేలాలు ఏరుకున్నట్లు ఉంది మాజీ సీఎం జగన్ వ్యవహారం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 74 ఏళ్ల వయసులో వరద నీటిలో నడుస్తూ ప్రజల పరిస్థితులను తెలుసుకుంటుంటే ఆయన మీద విమర్శలు చేయడం దుర్మార్గమన్నారు. రెండురోజుల నుంచి రాత్రనక, పగలనక నిద్రాహారాలు మాని చంద్రబాబు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. వైసీపీ నాయకులు వరద ప్రాంతంలో ఎక్కడా ఎటువంటి సహాయక చర్యల్లో పాల్గొన్న దాఖలాలు లేవన్నారు. రెండురోజుల తరువాత జగన్ వరద ప్రాంతాల్లో తిరుగుతూ ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. చేతనైతే ప్రజలకు సహాయం చేయాలి, లేదా ప్రభుత్వానికి మంచి సూచనలు ఇవ్వాలని హితవు పలికారు. జగన్‌కు తన సొంత నియోజకవర్గంలోనే ప్రజల ఆదరణ లేదని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రవిశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

జగన్ వ్యాఖ్యలు దుర్మార్గం : హరిప్రసాద్



విజయవాడ ప్రజలు వరద బీభత్సంతో అల్లాడుతుంటే మాజీ ముఖ్యమంత్రి జగన్ చేసిన వ్యాఖ్యలు దుర్మార్గమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. హరిటవర్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తుఫాను ప్రభావంతో విజయవాడ మొత్తం మునిగిపోయిందన్నారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు విజయవాడ కలెక్టరేట్‌లో మకాం వేసి ఎప్పటికప్పుడు ప్రజల స్థితిగతులను చూస్తున్నారన్నారు. స్వయంగా ముఖ్యమంత్రే ముంపు ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారన్నారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు ఎన్ని తుఫాన్లు వచ్చినా ఒక్కసారి కూడా బయటికి వచ్చిన దాఖలాలు లేవన్నారు. అందుకే జగన్‌ను ప్రజలు ఛీకొట్టారన్నారు. విజయవాడ వరద ముంపువాసుల కోసం చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారని జగన్‌కు చేతనైతే వరద బాధితులకు సహాయం చేయాలని హితవు పలికారు.

అక్రమ వెంచర్లపై కొరడా

- వైసీపీ ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా రియల్ దందా
- బద్వేలులో 60 ఎకరాల్లో అక్రమ వెంచర్లు
- వీటికి చెక్ పెడుతున్న అధికారులు

బద్వేలు, సెప్టెంబరు 3: బద్వేలు పేరు చెబితేనే భూ కబ్జాలు, ఆక్రమణలు, నకిలీ పట్టాలు గుర్తు కొస్తాయి. చాలా కాలంగా ఈ తంతు బద్వేలులో కొనసాగుతున్నా వైసీపీ ప్రభుత్వం వచ్చాక అడ్డూ, అదుపు లేకుండా ఈ వ్యవహారాలు జోరుగా సాగాయి. రియల్ ఎస్టేట్ పేరుతో కొందరు దందాలు సాగించారు. అనుమతులు లెక్కచేయకుండా లే అవుట్లు వేసి కోటీశ్వరులుగా పడగలెత్తేందుకు పన్నాగం పన్నారు. ఇలాంటి వెంచర్లు, అక్రమార్కులపై కొత్త ప్రభుత్వం వచ్చాక అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. దీంతో అక్రమ లే అవుట్లు వేసిన రియల్ వ్యాపారుల్లో దడ పుడుతోంది. వీటిలో తెలిసో, తెలియకో ప్లాట్లు కొన్నవారు ఇబ్బందులకు గురయ్యే పరిస్థితులు ఎదురవుతున్నాయి.

> **వాటిలో మౌలిక వసతులు కల్పించం**
>
> ఇప్పటికే అక్రమంగా వేసిన లే అవుట్లను గుర్తించి ప్లాట్ల అమ్మకం కొనుగోలు వీలు లేకుండా రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేశాం. ఆ ప్లాట్లలో మౌలిక వసతులు అయిన రోడ్లు, నీరు, డ్రైనేజీ సదుపాయాలు కల్పించం. అక్రమ లే అవుట్లు ఇంకా ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించి పై అధికారులకు తెలిపి చర్యలు చేపడతాం
>
> - నరసింహారెడ్డి, కమిషనర్, బద్వేలు

గోపవరం మండలంలో వెలసిన అక్రమ లే అవుట్లు



16 అక్రమ లే అవుట్లు

బద్వేలు పట్టణం రోజురోజుకు విస్తరిస్తోంది. మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయ్యాక స్థలాలకు మరింత గిరాకీ పెరిగింది. ఈ నేపథ్యంలో వెంచర్లు వెలుస్తూ వచ్చాయి. ఇదే అదనుగా కొందరు బద్వేలులో స్థలాలకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని అనుమతులకు మంగళం పలికి ఇష్టారాజ్యంగా వెంచర్లు వేశారు. 60 ఎకరాలలో 16కు పైగా ఈ లేఅవుట్లు వేసినట్లు అధికారులు గుర్తిం చారు. వీటిలో ఎవరైనా ప్లాట్లు కొంటే రిజిస్ట్రేషన్ చేయరని, మౌలిక వసతులు కల్పించమని తెలపడంతో పాటు ఇలాంటి లే అవుట్‌లలో యజమానులు అమ్మకాలు జరి పిస్తే చర్యలు తీసుకుంటామని బద్వేలు మున్సిపల్ అధికా రులు హెచ్చరించారు. ఇలాంటి వెంచర్లు పరిశీలిస్తే బద్వేలు పట్టణ పరిసరాలలో 9 ఎకరాల్లో ఒకటి, 2.5 ఎకరాలలో ఒకటి, 16.51 ఎకరాలలో ఒకటి, 14.51 ఎకరాలో ఒకటి, 2.48 ఎకరాలలో ఒకటి, 2.33 ఎకరాలలో ఒకటి, 3.34 ఎకరాలలో ఒకటి, 9.92 ఎకరాలలో ఒకటి, చెన్నం పల్లిలో 5.5 ఎకరాలలో ఒకటి.. ఇలా బద్వేలు మండలంలో 9 వెంచర్లు వేశారు. అలాగే గోపవరం మండలంలోని మడ కల వారిపల్లె ప్రాంతంలో 5.8 ఎకరాలలో ఒకటి, 4.4 ఎకరాలలో ఒకటి, 6.07 ఎకరాలలో ఒకటి, 1.75 ఎకరాలలో మరొకటి .. ఇలా అక్రమ వెంచర్లు వేశారు. వీటన్నింటిపై బద్వేలు మున్సిపల్ అధికారులు దృష్టి సారించి ఈ వెంచర్లకు అనుమతులు లేవని తెలియజేయడంతో పాటు వీటిపై చర్యలు తీసుకోవడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. దీంతో అక్రమ లేఅవుట్‌దారులలో గుబులు రేగడంతో పాటు రియల్ ఎస్టేట్‌పై కూడా ప్రభావం చూపనుంది. కాగా.. ఇప్పటికే వీటిలో స్థలాలు కొన్నవారు లబోదిబోమంటున్నారు.

భూ ఆక్రమణలపై ప్రభుత్వం గురి

● బద్వేలులో ఆక్రమిత స్థలాలు స్వాధీనం

(కడప-ఆంధ్రజ్యోతి): బద్వేలు.. ఒకప్పుడు ఈపేరు వింటే కాలజ్ఞాని వీరబ్రహ్మేంద్రస్వామి గుర్తుకు వచ్చేవారు. అయితే జగన్ పాలనలో వైసీపీ భూ కాలకేయుల వల్ల బద్వేలు అంటేనే భూకబ్జాలు అనే పరిస్థితి వచ్చింది. జగన్ హయాంలో బద్వేలులో వైసీపీ రాబందులు వందల కోట్ల విలువచేసే ప్రభుత్వ స్థలాలను ఆక్రమించారు. అటు కలసపాడు మొదలుకుని కాశినాయన, పోరుమామిళ్ల, బి.కోడూరు, బద్వేలు, గోపవరం మండలాల్లో.. కబ్జాకు కాదేదీ అనర్హం అన్నట్టుగా వాగులు, వంకలు, పోరంబోకు భూములను ఆక్రమించేశారు. మంత్రి నారా లోకేశ్ యువగళం పాదయాత్ర సందర్భంగా బద్వేలులో జరిగిన బహిరంగసభలో భూకబ్జాలపై ఫైర్ అయ్యారు. అధికారంలోకి వస్తే విచారణ జరిపిస్తామన్నారు. చంద్రబాబు కూడా జిల్లాలో ఎన్నికల పర్యటనలో బద్వేలులో భూకబ్జాలకు సంబంధించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. వారు చెప్పిన ప్రకారం కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక భూ ఆక్రమణ దారులపై చర్యలు మొదలయ్యాయి. బద్వేలు మున్సి పాలిటీలోని గుంతపల్లె రెవెన్యూ పొలం సర్వే నెం.948లో సుమారు రూ.8కోట్ల విలువచేసే 10.30 ఎకరాలను తహశీల్దారు విజయభాస్కర్ ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్నారు. అలాగే కడప రోడ్డు లోని గుంతపల్లె రెవెన్యూ పొలం సర్వే నెం.955/2లో ఒకటిన్నర కోటి విలువచేసే 50 సెంట్ల భూమి స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డులు నాటారు. గోపవరం రెవెన్యూ పొలం సర్వే నెం.290లో సుమారు కోటి రూపాయల విలువ చేసే 59.28 సెంట్లను స్వాధీనం చేసుకుని ఇది ప్రభుత్వభూమి అంటూ బోర్డు నాటారు. బద్వేలులో భూకబ్జాలపై కలెక్టర్ శివశంకర్ చేపడుతున్న చర్యలతో స్థానికుల్లో హర్షం వ్యక్తమవుతోంది. అయితే ప్రభుత్వ భూముల ఆక్రమణలపై చర్యలు కేవలం బద్వేలుకే పరిమితం కాకుండా జిల్లా అంతటా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



గోపవరంలో ఇది ప్రభుత్వ భూమి అంటూ బోర్డు నాటిన దృశ్యం

అరటికి.. వైరస్ పోటు

- ఎన్ని మందులు పిచికారి చేసినా... ఫలితం లేదంటున్న రైతులు
- ఉద్యాన కళాశాల ఆచార్యుల బృందం పరిశీలన
- శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలి



తెగులు సోకిన అరటి మొక్క

రైల్వేకోడూరు, సెప్టెంబరు 3: అరటి పంటకు వైరస్ ఆశించింది. ఎన్ని మందులు పిచికారి చేసినా ఫలితం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గం అరటి పంటకు పెట్టింది పేరు. రైల్వేకోడూరు, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట, ఓబులవారిపల్లె మండలాలలో అరటి పంటను సుమారు 20 వేల హెక్టార్లలో పండిస్తున్నారు. ఇటీవల కాలంలో అరటి కాయలకు మంచి డిమాండు (కిలో రూ.20 నుంచి రూ.25లకు)తో పాటు ఆశించిన దిగుబడులు రావడంతో అరటి రైతులకు సిరులు కురిపించాయి. అయితే ప్రస్తుతం అరటి పంట ఎత్తివేసి మళ్లీ అరటి పిలకలను రైతులు కొత్తగా నాటారు. నాటిన నెల రోజులకు వైరస్ సోకడంతో మందులు పిచికారి చేస్తున్నారు. అయితే ఎన్ని మందులు పిచికారి చేసినా ఫలితం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అరటి ఆకులు వైరస్ దెబ్బకు స్వభావం మారుతున్నాయి. ప్రధానంగా రైల్వేకోడూరు నియోజకవర్గంలో గ్రాండ్-9, అమృతపాణి, సుగంధాలు, ఎర్ర అరటి రకాలను రైతులు పండిస్తున్నారు. ఇటీవల రైతుల వినతుల మేరకు అనంతరాజుపేట ఉద్యాన కళాశాల ఆచార్యుల బృందం రైల్వేకోడూరు మండలం అనంతరాజుపేట, ఉర్లగట్టుపోడు తదితర ప్రాంతాల్లో వైరస్ సోకిన పంటలను పరిశీలించారు. అరటికి స్ట్రీక్ వైరస్ సోకిందని నిర్ధారించారు.

వైరస్ వ్యాప్తి.. యాజమాన్య పద్ధతులు

వైరస్ తెగులు సోకిన పిలకల ద్వారా మొక్క నాటిప్పుడు వ్యాప్తి చెందుతుంది. అంతే కాకుండా మొజాయిక్, పేనుబంక అనే రసం పీల్చు పురుగుల ద్వారా వ్యాప్తి చెందుతుంది. పిండిపురుగుల (స్ట్రీక్ వైరస్) ద్వారా వ్యాప్తి చెందుతుంది. వైరస్‌ను అరికట్టడానికి క్వారెంటైన్ పద్ధతులు ఖచ్చితంగా పాటించాలి. తెగులు సోకిన ప్రాంతం నుంచి వేరొక రాష్ట్రానికి, ప్రాంతానికి సరఫరా చేయకూడదు. తెగులు లేని దుంపలను లేదా మొలకలను పొలంలో నాటుకు వాడాలి. దుంపలను నాటే ముందు 40 డిగ్రీల వేడి గాలి ఉపయోగించుట వలన వైరస్‌ను తగ్గించుకోవచ్చు. దోస జాతి పంటలను అంతర పంటగా వేయరాదు. దోస వేసిన పొలంలో అరటిని వేయకుండా పంట మార్పిడి విధానం చేయాలి. తెగులు వ్యాప్తి చేసే రసంపీల్చే పురుగులను నివారించుటకు డైమిథోయేట్ రెండు మిల్లీలీటరు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మిల్లీ లీటర్లు, లేదా అసిఫేట్ 1గ్రాము లీటరు నీటికి కలిపి మార్చి మార్చి 15 రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి. పొలానికి సత్తువ నిచ్చే వేపపండి లేదా ఆముదం పండి, రసాయన ఎరువులను సిఫార్సు మేరకు వాడాలి. అంతేకాకుండా సూక్ష్మధాతువుల లోపాలను నివారించుటకు మొక్కకు అందిస్తే తెగులను తట్టుకునే సామర్థ్యం పెరుగుతుంది. మొలకలను పరిక్షించి రైతులు తెచ్చుకోవాలి. కురుబేల్, అలియకోల్, ఎలావెజ్ రకాల అరటి పిలకలు తెగులును తట్టుకుంటాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



తెగులు సోకిన అరటి పంటను పరిశీలిస్తున్న ఉద్యాన కళాశాల ఆచార్యులు

శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి



అరటి రైతులు తెగుళ్ల వ్యాప్తిచెందినప్పుడు శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటించాలి. మొదట దశ లోనే తెగుళ్లను నివారించుకోవాలి. లేదంటే ఎక్కువ అయ్యే ప్రమాదం ఉంటుంది. తగిన సూచనల మేర కు ఎరువులు, పురుగు మందులు వాడాలి. తెగుళ్ల తగ్గలేదని రైతులు విచ్చలవిడిగా మందులు పిచికారి వేస్తే పంటలకు ఇబ్బందులు ఎదురౌతాయి. తగిన మోతాదు లోనే ఎరువులు, పురుగు మందులు ఉపయోగించాలి.

-సీహెచ్ రూత్‌బెనర్జీ, అనంతరాజుపేట ఉద్యాన కళాశాల ఆచార్యులు

నాణ్యత కల్గిన పిలకలను ఎంపిక చేసుకోవాలి



నాణ్యత గల మొక్కలను ఎంపిక చేసుకోవాలి. ఎంపికలో ఎక్కడా రైతులు రాజీ లేకుండా ఉండాలి. మొక్కలు తెచ్చినప్పుడు వాటి స్థితిగతులను తెలుసుకోవాలి. మొక్కలను నాటి విధానాన్ని ముందుగా క్రమ పద్ధతిలో చేసుకోవాలి. వేరు పురుగులు ఆశించకుండా శాస్త్రవేత్తల సలహాలు తీసుకోవాలి. తెగుళ్ల నివారణ కోసం ప్రత్యేక చర్యలు ముందుస్తుగా చేపట్టాలి

- కె.స్వరాజ్యలక్ష్మి, ఉద్యాన కళాశాల ఆచార్యులు

పోషకాలు అందిస్తూ, సూచనలు పాటించాలి



అరటి పంటకు పోషకాలు అందిస్తూ, సూచనలు ప్రధానంగా రైతులు పాటించాలి. పంట మార్పిడి చేసుకోవాలి. దోస పంటలు వేసి పొలాల్లో అరటి పంట వేయరాదు. వేస్తే తెగుళ్ల విచ్చలవిడిగా వ్యాప్తి చెందుతాయి. రైతులు యాజమాన్య పద్ధతులు సక్రమంగా పాటించాలి.

-వై.దుర్గ, తెగుళ్ల విభాగం పీహెచ్‌డీ విద్యార్థిని

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



మొక్కలు నాటుతున్న వైస్‌చాన్సలర్ విశ్వనాథకుమార్

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 3: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ వైస్‌చాన్సలర్ విశ్వనాథకుమార్ తెలిపారు. మంగళవారం కడప నగరం యూనివర్శిటీ ఆవరణలో సమ్మరిటన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అమ్మపేరుతో ఒక మొక్క అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రస్తుతం పెరుగుతున్న కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు కనీసం అమ్మ పేరు మీద ఒక మొక్క నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏబీవీఎస్ ప్రిజర్వేర్ సేవా సమితి వ్యవస్థాపకులు అశోక్, యూనివర్శిటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ రమాదేవి, వరలక్ష్మి, స్టెప్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విధుల నుంచి తొలగించవద్దు...

- నాన్ టీచింగ్ స్టాఫ్ ఉద్యోగుల వేడుకోలు



నిరసన వ్యక్తం చేస్తున్న నాన్ టీచింగ్ స్టాఫ్

చెన్నూరు, సెప్టెంబరు 3: వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో పనిచేస్తున్న తమను తొలగించడం అన్యాయమని.. ఉద్యోగాల్లో కంటిన్యూ చేయకపోతే మా కుటుంబాలు వీధిన పడతాయంటూ నాన్ టీచింగ్ స్టాఫ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు తమను ఆ యూనివర్సిటీ వీసీ తొలగిస్తున్నారన్న సమాచారంతో మంగళవారం యూనివర్సిటీ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్టాఫ్‌కు చెందిన షేక్ రబీవుల్లా మాట్లాడుతూ తమను ఈ ఏడాది మార్చిలో అవుట్‌సోర్సింగ్ కింద 47 మందిని తీసుకున్నారని, అయితే జూలై వరకు జీతాలు చెల్లించి ఆగస్టులో తొలగిస్తున్నామని చెప్పడం దారుణమన్నారు. తామంతా పేదలమని, మాలో కొందరు వికలాంగులు ఉన్నారన్నారు. పనిచేస్తేనే తమ జీవితాలు గడుస్తాయని.. ఏ కారణం చూపించకుండా తమను తొలగిస్తామని చెప్పడం అన్యాయమన్నారు. వైవీయూ, డాక్టర్ బీఆర్ యూనివర్శిటీ, పులివెందుల, కడప రిమ్స్ కళాశాలలో తమలాగే ఉద్యోగులు పనిచేస్తున్నా వారిని తొలగించలేదని.. కేవలం ఇక్కడ మాత్రమే తొలగించడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. ఇంటర్వ్యూద్వారా ఈ ఏడాది మార్చి 15న తీసుకున్న తమను ఇలా తీసేస్తామని చెప్పడం తగదని.. ఈ విషయంలో తాము ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు వినతిపత్రతాలు పంపుతామని తెలిపారు.

తైక్వాండో పోటీల్లో జిల్లాకు బంగారు పతకం



బంగారు పతకం అందుకుంటున్న నాగేంద్రబాబు

కడప (స్పోర్ట్స్), సెప్టెంబరు 3 : తిరుపతిలో జరిగిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ పురుషుల, మహిళల తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి కడప జిల్లాకు చెందిన ఎస్.నాగేంద్రబాబు బంగారు పతకం సాధించాడు. అండర్ 87 కేజీల విభాగంలో విజేతగా నిలిచి బంగారు పతకం అందుకున్నారు. దీంతో త్వరలో పాండిచ్చేరిలో జరగనున్న నేషనల్ పోటీలకు నాగేంద్రబాబు అర్హత సాధించారని జిల్లా తైక్వాండో అసోసియేసన్ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

- షార్ట్‌సర్క్యూట్‌తో ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు
- మూడు బైకులు దగ్ధం



షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోయిన బైకులు

కడప (క్రైం), సెప్టెంబరు 3: కడప నగరం కోఆపరేటివ్ కాలనీలోని సిటీ యూనియన్ బ్యాంకు వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. మంటలు ఎగిసి పడటంతో బ్యాంకు వద్ద పార్క్ చేసి ఉన్న బైకులకు నిప్పంటుకుంది. దీంతో మూడు బైకులు పూర్తిగా దగ్ధమయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు కడప ఫైర్ అధికారులు, వన్‌టౌన్ ఎస్ఐ అమర్‌నాథరెడ్డిలు సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. ఫైర్ అధికారులు మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే మంటలు చెలరేగిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పిపోయినట్లయ్యింది. కాలిపోయిన బైకులు ఇద్దరు బ్యాంకు ఉద్యోగులవి కాగా, మరో మూడు బైకులు సమీపంలో ఉన్న జిమ్‌కు వచ్చే వారివిగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు కడప ఫైర్ అధికారి బస్విరెడ్డి తెలిపారు. మొత్తం రూ.5లక్షల మేర ఆస్తినష్టం సంభవించినట్లు తెలిపారు.

రెండు స్కూటీలు ఢీ...ఒకరు మృతి



శ్రీనివాసులరెడ్డి మృతదేహం

ముద్దనూరు సెప్టెంబరు 3: మండల పరిధి కడప, తాడిపత్రి జాతీయ రహదారిలోనియామవరం సచివాలయం సమీపంలో మంగళవారం రెండు స్కూటీలు ఢీకొన్న ప్రమాదంలో శ్రీనివాసులరెడ్డి (50) మృతి చెందినట్లు ఏఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.చింతకుంట గ్రామానికి చెందిన శ్రీనివాసులరెడ్డి ఆయన సోదరుడు రామాంజులరెడ్డి స్కూటీలో పని నిమిత్తం ముద్దనూరుకు వస్తున్నారు. యామవరం గ్రామానికి చెందిన కిరణ్‌కుమార్‌రెడ్డి అతివేగంగా వచ్చి ముందు వెళుతున్న స్కూటీని అతివేగంగా వచ్చి ఢీకొన్నాడు. దీంతో స్కూటీలోని శ్రీనివాసులరెడ్డి రోడ్డుపై పడటంతో తలకు తీవ్రగాయమైంది. వెంటనే ముద్దనూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా మృతి చెందాడు. మృతుని సోదరుడు రామాంజులరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

మూడు ట్రాక్టర్లు సీజ్

వేంపల్లె, సెప్టెంబరు 3: వేంపల్లె పాపాఘ్ని నది నుంచి ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ తిరుపాల్‌నాయక్ తెలిపారు. అందిన సమాచారంతో సోమవారం రాత్రి దాడులు చేసి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకుని.. స్థానిక పోలీసుస్టేషన్‌కు తరలించామని తెలిపారు.

విమానాశ్రయ అభివృద్ధికి చర్యలు : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లోతేటి శివశంకర్

కడప(కలెక్టరేట్) సెప్టెంబరు 3: పర్యావరణానికి ఎలాంటి అంతరాయం లేకుండా నిబంధనలకు లోబడి కడప విమా నాశ్రయ అభివృద్ధి పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆ కమిటీ ఛైర్మన్, జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ పేర్కొన్నారు. మంగళవారం కడప విమానాశ్రయం టర్మినల్ బిల్డింగ్‌లో కలెక్టర్ అధ్యక్షతన ఏరోడ్రమ్, ఎయిర్‌ఫీల్డ్, ఎన్విరాన్మెంట్ కమిటీల సమావేశం జరిగింది. ఈసందర్భంగా సేఫ్టీ, సెక్యూరిటీలకు సంబంధించిన పలు విషయాలను, ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు విమానాశ్రయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై కమిటీ చర్చించింది. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పౌర విమానయాన సేవా రంగంలో ప్రయాణికుల అనుభవాలు, సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని భారతీయ విమానాశ్రయాలను ఉన్నత ప్రమాణాలతో అంతర్జాతీయ స్థాయికి దీటుగా అభివృద్ధి చేస్తోందన్నారు. ఆధునిక జీవన శైలికి అనుగుణంగా విమానాశ్రయాల్లో ప్రయాణికులకు సౌకర్యాలను మెరుగు పరుస్తోందన్నారు. కడప విమానాశ్రయం నుంచి భవిష్యత్తులో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని నూతన టెర్మినల్ భవన నిర్మాణానికి భారతీయ విమానాశ్రయాల ప్రాధికార సంస్థ తగు చర్యలు చేపట్టిందన్నారు. రూ.266 కోట్ల వ్యయంతో చేపట్టనున్న నూతన టెర్మినల్ భవన అభివృద్ధి పనుల అనంతరం కడప విమానాశ్రయం ఒక అపురూపమైన జవసత్వాలు సంతరించుకోనుందన్నారు. ఎయిర్‌పోర్టు అథారిటీ, ఆర్అండ్‌బీ, నేషనల్ హైవే, పోలీసు శాఖలు జాయింట్ కమిటీగా ఏర్పాటై.. అందుకు సంబంధించిన రోడ్లు, రవాణా వ్యవస్థ తదితర మౌలిక సదుపాయాలను పర్యవేక్షిస్తుందన్నారు. ఏపీఎస్పీఎస్‌లో భాగంగా కొరత ఉన్న సిబ్బందిని నియమించడం జరుగుతోందన్నారు. ఎయిర్‌పోర్టు పరిసరాలను శుభ్రంగా, అహ్లాదకరంగా ఉంచడంలో కడప కమిషనరు, పంచాయితీరాజ్ శాఖలు ప్రత్యేకంగా బాధ్యతలు తీసుకోవాలన్నారు. సుందరంగా తీర్చిదిద్దాలని కమిటీ సభ్యులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, డీఎఫ్‌ఓ సందీప్‌రెడ్డి, విమానాశ్రయం డైరెక్టర్, కమిటీ కన్వీనరు సుజిత్‌కుమార్, కాషో ఆనందయ్య, అదనపు మున్సిపల్ కమిషనరు రాకేష్‌చంద్ర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూఆక్రమణలపై చర్యలు తీసుకోండి

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



స్థానికుల సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

సంబేపల్లె, సెప్టెంబరు 3: ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల పరిధిలో దేవపట్ల గ్రామంలో గంగాహోటల్ సమీపంలో 30 ఏకరాలు ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఆర్డీవోతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుట్టపల్లె, గుడిబండ రోడ్డు మార్గంలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఆ భూమిలో దున్నకాలు చేపట్టడంతో వెంటనే అధికారులు స్పందించి బోర్డు ఏర్పాటు చేయాలని తెలియజేశారు. మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణపై తహశీల్దార్‌తో మాట్లాడారు. గతంలో తహశీల్దార్ ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోకపోగా.. వారికి సహకరించినట్లు తెలిపారు. దేవపట్ల గురుకుల పాఠశాల వద్ద చిన్నపీరయ్య అనే వ్యక్తి ఇంటి నిర్మాణం చేపడుతుంటే ఏఎస్ఐ అయూబ్ ఖాన్ అడ్డుకున్నట్లు తెలపడంతో.. మిగిలిన వాళ్లను ఎందుకు అడ్డుకోలేదని ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదవాడికి ఓ న్యాయం, ఉన్నవాడికి ఓ న్యాయమా అంటూ ఆయనపై చిందులేశారు. ప్రభుత్వ భూమి ఆక్రమించిన వారు ఎంతటి వారైన చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మల్లు నరసా రెడ్డి, భాస్కర్‌రెడ్డి, బయ్యారెడ్డి, ఖాదర్‌హుసేన్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి



మాట్లాడుతున్న జేఎన్‌టీయూఏ వీసీ ప్రొఫెసర్ సుదర్శన్‌రావు



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 3 : బీటెక్ విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని జేఎన్‌టీయూఏ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు పేర్కొన్నారు. మంగళవారం శ్రీదేవి ఫంక్షన్ హాలులో సీబీఐటీ ఇంజనీరింగ్ కళాశాల ఫ్రెషర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఏ బ్రాంచ్ ఎంచుకున్నా ఇష్టపడి చదువుకోవాలని సూచించారు. ఉత్తమ మార్కులు సాధించినప్పుడే మంచి ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. బీటెక్ విద్యార్థులకు మూడు అవకాశాలు ఉంటాయని, ఉన్నత చదువులు చదవడం, మంచి ఉద్యోగం సాధించడం, లేదా సొంత వ్యాపారం చేసే అవకాశాలు ఉంటాయన్నారు. విద్యార్థులు గేట్ పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. కళాశాల చైర్మన్ జయచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలని సూచించారు. విద్యార్థులు వాట్సాప్, పేస్‌బుక్‌లు చూడటం వలన సమయం వృధా అని గుర్తించాలన్నారు. ర్యాగింగ్‌కు కఠిన చట్టాలు ఉన్నాయని, రాగింగ్ చేసి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని తెలిపారు. విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని.. కోర్సు పూర్తయ్యే నాటికి రూ.12లక్షల ప్యాకేజీతో ఉద్యోగం వచ్చేలా కృషి చేస్తామన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో భారతీ ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ లోహిత్‌రెడ్డి, ప్రిన్సిపల్ శృతి, అడ్మినిస్ట్రేటివ్ ప్రిన్సిపల్ శ్రీనివాసులరెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్పీడీసీఎల్ మాజీ ఎస్ఈ జీవీ వెంకటరమణ మృతి



జీవీ వెంకటరమణ

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 3: తెలుగు యువత రాష్ట్ర నాయకుడు జీవీ సారథినాయుడు తండ్రి కడప ఏపీఎస్పీడీసీఎల్ మాజీ సూపరింటెండెంట్ ఇంజినీర్ గాలివీటి వెంకటరమణ మంగళవారం తెల్లవారుజామున మరణించారు. ఆయన ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్నాడు. 2003 నుంచి 2007 వరకు ప్రొద్దుటూరులో ఏపీ ఎస్పీడీసీయల్ డీఈగా పనిచేశారు. అలాగే 2007లో ఎస్ఈగా పనిచేస్తూ పదవీ విర మణ చేశారు. ఆయనకు విజయసారథి, విజయ భాస్కర్ కుమారులు, విజయ జ్యోతి కుమార్తె ఉన్నారు. ఈయన ఎంపీ సీఎం రమేష్ సమీప బంధువు. ఆయన అంత్యక్రియలు కదిరి తాలూకా నల్లచెరువు మండలం చిన్నఎల్లంపల్లెలో శుక్రవారం ఉదయం నిర్వహిస్తున్నట్లు సారథినాయుడు తెలిపారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

గణేశ్ విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

● నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు





పులివెందుల: సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు నజీర్ అహ్మద్... వేముల: మాట్లాడుతున్న సీఐ నాగరాజు

పులివెందుల టౌన్, సెప్టెంబరు 3 : వినాయకచవితి సందర్భంగా గణేశ్ విగ్రహాలు ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి అని తహసీల్దారు నజీర్ అహ్మద్ తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం సింగిల్‌విండో విధానం అమల్లోకి తెచ్చిందన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో గణేశ్ విగ్రహాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గణేశ్ విగ్రహాలు ఏర్పాటు చేసేవారు ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకునే విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. గణేశ్ విగ్రహాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు ఫోన్‌లో వాట్సప్ 7995095800 నంబరుకు హాయ్ అని సందేశం పంపితే నిరభ్యంతర పత్రం కోసం అనుసరించాల్సిన విధానం అంతా వాట్సప్‌లో వస్తుందన్నారు. ఆన్‌లైన్‌లో గణేశ్ ఉత్సవ నెట్ అని ఇంగ్లీషులో టైప్ చేస్తే సంబంధిత వెబ్‌సైట్ అందుబాటులోకి వస్తుందన్నారు. ఆ వెబ్‌సైట్‌లో గణేశ్ మండపం ఏర్పాటు కమిటీ వివరాలు, ఏ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్నారనే చిరునామా, పోలీసుస్టేషన్ పరిధి, విగ్రహానికి సంబంధించి వివరాలు నమోదు చేయాలన్నారు. నిమజ్జనం ఎక్కడ చేస్తారు, ఎప్పుడు చేస్తారు, ఏ వాహనంలో తీసుకెళ్తారనేది దరఖాస్తులో పూర్తి చేయాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తును పరశీలించిన సంబంధిత పోలీసు స్టేషన్ అధికారి, అగ్నిమాపక, విద్యుత్ శాఖ, పురపాలక శాఖ అధికారులు కలిసి విగ్రహం ఏర్పాటు చేసే ప్రాంతాన్ని పరిశీలిస్తారన్నారు. అనంతరం క్యూఆర్ కోడ్‌తో కూడిన నిరభ్యంతర పత్రం జారీ చేస్తారన్నారు. ఆ పత్రాన్ని ప్రింట్ తీసి గణేశ్ మండపంలో ఉంచాలని, గణేశ్ మండపాల బాధ్యత కమిటీ వారిదేనన్నారు. మండలాల వద్ద ఉదయం 6 నుంచి 10 గంటల వరకు స్పీకర్లు వినియోగించాలని, మైకులు, సౌండ్ బాక్సులకు పోలీసు అధికారుల వద్ద అనుమతులు పొందాలన్నారు. అనుచిత ప్రదర్శనలు నిషేదం, నిమజ్జనానికి అనుమతించిన రోజే నిర్వహించాలని పేర్కొన్నారు. నిర్వాహకులలో ముగ్గురు సభ్యులు రాత్రుల్లో మండపాల్లో ఉండాలన్నారు. సీఐ జీవన్ గంగానాథ్‌బాబు, విద్యుత్ శాఖ ఏఈ జగదీశ్వర్‌రెడ్డి, ఫైర్ ఆఫీసరు రామక్రిష్ణ, రెవెన్యూ అధికారులు, గణేశ్ విగ్రహ నిర్వాహకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పండుగను నిర్వహించుకోండి

కడప (క్రైం), సెప్టెంబరు 3 : మత సామరస్యానికి ప్రతీక కడప అని, ఇటువంటి జిల్లాలో వినాయకచవితి పండుగను ఎటువంటి ఘర్షణలకు తావు లేకుండా అందరూ సమన్వయంతో, భక్తి భావంతో, శాంతియుతంగా జరుపుకోవాలని పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు వివిధ పోలీసుస్టేషన్ల పరిధిల్లో రానున్న వినాయకచవితి పండుగ నేపధ్యంలో మంగళవారం పీస్ కమిటీ, ఉత్సవ కమిటీలతో పోలీసులు సమావేశాలు నిర్వహించారు. ప్రభుత్వ నియమ నిబంధనలు తప్పరాదన్నారు. విగ్రహాలను వాహనాల్లో తీసుకువచ్చేటప్పుడు బాణసంచా కాల్చరాదని అన్నారు. వినాయక ఉత్సవ పందిళ్ల వద్ద కానిస్టేబుల్, హోంగార్డు భద్రతా సిబ్బంది పర్యవేక్షణ తప్పకుండా ఉంటుందన్నారు. ఉత్సవాల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులున్నా పోలీసుల దృష్టికి తేవాల న్నారు. ఎవరు ఎటువంటి గొడవలకు, అల్లర్లకు పాల్పడినా వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు విగ్రహ ప్రతిష్ఠాపన సమయంలో గణేశ్ ఉత్సవాల్లో పోలీసు అధికారులకు సహకరించాలన్నారు. సమావేశంలో గ్రామపెద్దలు, ఉత్సవ కమిటి నిర్వాహకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

సీకేదిన్నె, సెప్టెంబరు 3:గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. సీకేదిన్నె పోలీసు స్టేషన్‌లో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను చింతకొమ్మదిన్నె మండలంలో ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్నారు. నిర్వాహకులు విగ్రహం ఏర్పాటు వద్ద ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఒకే గ్రామంలో రెండు మూడు విగ్రహాలు పెడితే అక్కడ విగ్రహ ఏర్పాటు చేయడంలోకానీ, నిమజ్జనంలో కానీ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. సంబంధిత అనుమతులు తప్పనిసరిగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సికెదిన్నె పోలీసులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

వేముల, సెప్టెంబరు 3: మండల వ్యాప్తంగా వినాయక చవితి సందర్భంగా గ్రామాలలో ఏర్పాటుచేయనున్న వినాయక విగ్రహాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఆర్కేవ్యాలీ సీఐ నాగరాజు, వేముల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వినాయక ఉత్సవ కమిటీలతో సమావేశమైన వారు మాట్లాడుతూ మం డలంలో ఏర్పాటు చేయనున్న వినాయక విగ్రహాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. విద్యుత్ శాఖ నుంచి కూడా అనుమతి తీసుకోవాలని సంబంధిత అనుమతులన్నీ ఆన్‌లైన్ ద్వారా అప్లైచేసుకోవాలని లేకపోతే 7995095800 నెంబర్‌కు వాట్సప్‌లో హాయ్ అని పంపితే లింక్ వస్తుందని ఆ లింక్‌లో సంబంధిత వివరాలను పూర్తిచేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అందజేయాలని సీఐ నాగరాజు తెలిపారు. గ్రామాలలో ప్రజలకు అసౌకర్యం కలుగని ప్రదేశంలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఊరేగింపులలో ఎటువంటి డీజేలకు,రికార్డింగ్ డ్యాన్స్‌లకు ఎటువంటి అనుమతులులేవని తెలిపారు. పోలీసు నిబంధనలను అతిక్రమించకుండా పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్: బీటెక్ రవి



ప్రజాదర్బారులో ప్రజల సమస్యలు వింటున్న బీటెక్ రవి

పులివెందుల టౌన్, సెప్టెంబరు 3 : సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు పులివెందల టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రజలు తమ సమస్యలు చెప్పుకుని అర్జీలు అందించారు. కొన్నిసమస్యలు ఫోను ద్వారా సంబంధిత అధికారులకు తెలిపి పరిష్కరించాలని కోరారు. గ్రా మాల నుంచి వచ్చిన ప్రజలు పెద్దఎత్తునతరలివచ్చి వినతిపత్రాలు సమర్పించారు. పెన్షన్. రేషన్‌కార్డుల మంజూరు, విద్య, వైద్యం ఉద్యోగాలు ఇప్పించాలని అర్జీలు సమర్పించారు.అన్నివర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ ప్రభుత్వ పాలన అందిస్తుందన్నారు. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తేవాలని బీటెక్ రవి ప్రజలకు సూచించారు. అన్ని సమస్యలు పరిష్కరించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విజయదుర్గాదేవి సన్నిధిలో రాహుకాల పూజలు





అలంకారంలో అమ్మవారు... రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప (కల్చరల్), సెప్టెంబరు 3: కడప నగరం బిల్టప్ సమీపంలోని విజయదుర్గాదేవి సన్నిధిలో మంగళవారం రాహుకాల పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్ భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం కావడంతో అమ్మకు తెల్లవారుజామునే పంచామృతాభిషేకం నిర్వహించి తదుపరి నిత్య పూజలు చేశారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.30 గంటల వరకు రాహుకాల పూజలు నిర్వహించారు. భక్తులు పూజల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'అన్నదాతా సుఖీభవ'ను వెంటనే అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం నాయకులు ప్రభాకర్‌రెడ్డి

సీకేదిన్నె, సెప్టెంబరు 3: అన్నదాతా సుఖీభవ పథకం కింద రైతుకు పెట్టుబడి సాయం రూ.20 వేలు అందించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. చింతకొమ్మదిన్నె మండలం కులుములపల్లెలో రైతు సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనె 9, 10 తేదీల్లో గ్రామ సచివాలయాల్లో అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం కోసం గ్రామ సచివాలయాల్లో వినతి పత్రాలు అందజేస్తామన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు గడిచిపోయిందని, ప్రభుత్వం ఇంతవరకు పెట్టుబడి సాయం అందించలేదన్నారు. వడ్డీవ్యాపారుల చుట్టూ రైతులు పెట్టుబడి సాయం కోసం తిరగాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు పెట్టుబడి సాయం అందించాలన్నారు.ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాలకృష్ణయ్య, కార్యదర్శులు దస్తగిరిరెడ్డి, చిన్నసిద్దయ్య, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

మైలవరం దక్షిణ కాల్వ ద్వారా చెరువులకు నీరు వదలాలి

కమలాపురం రూరల్, సెప్టెంబరు 3 : మైలవరం దక్షిణ కాల్వ ద్వారా కమలాపురం చెరువుకు నీరు వదలాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో కమలాపురం చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏపీ రైతు సంఘం కడప జిల్లా సమితి ఆధ్వర్యంలో కమలాపురం చెరువుకు మైలవరం డ్యామ్ దక్షిణ కాల్వ నుంచి నీటిని విడుదల చేసి చెరువును నింపాలన్నారు. ఖరీఫ్‌లో వర్షాభావం నేపథ్యంలో పాపాఘ్ని నది ప్రవహించక దాని ద్వారా రావాల్సిన నీరు రాకపోవడంతో చెరువు పూర్తిగా నిండిపోయిందన్నారు. కావున తాగు, సాగు నీటి అవసరాల కోసం మైలవరం దక్షిణ కాల్వ నుంచి నీరు విడుదల చేసి కమలాపురం చెరువు నింపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షుడు క్రిష్టారెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి నాగేశ్వర్‌రావు, స్థానిక రైతు సంఘం నాయకులు శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చేతివృత్తుల వారికి విశ్వకర్మ ద్వారా ప్రయోజనం: ఈడీ

కడప (ఎన్టీఆర్ సర్కిల్), సెప్టెంబరు 3: చేతివృత్తుల వారికి విశ్వకర్మ ద్వారా ప్రయోజనం ఉంటుందని బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్.జయసింహ పేర్కొన్నారు. పీఎం విశ్వకర్మ పథకం కింద వడ్రంగి, పడవల తయారీ, కమ్మరి, స్వర్ణకారులు, కుమ్మరి, శిల్పకారులు, చర్మకారులు, చెప్పులు కుట్టేవారు, తాపీ పనిచేసేవారు, బుట్ట, చాప, చీపుర్లు నేసేవారు, బొమ్మల తయారీదారులు, క్షురకులు, రజకులు, దర్జీలు, చేపల వల తయారీదారులు ఈ పథకానికి అర్హులన్నారు. చేతివృత్తులు చేసుకనే పథకాలకు 18 సంవత్సరాల కంటే ఎక్కువ వయసు కలిగి వారి పూర్వీకుల నుంచి కుటుంబ వృత్తిగా చేస్తున్న హస్తకళాకారులు పీఎం విశ్వకర్మ పథకానికి నమోదు చేసుకోవడానికి అర్హులన్నారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం,బ్యాంకు పాస్‌పుస్తకం, మొబైల్ ఫోన్ నెంబరుతో అర్హులైన వారు ఈ పథకంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. లబ్ధిదారుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం క్రెడిట్ ఆధారిత పథకాల కింద రుణాలు పొంది ఉండకూడదని ఆయన వివరించారు.

పథకం వల్ల ప్రయోజనాలు: వ్యాపార అభివృద్ధికి రుణాలు ఇస్తారన్నారు. రోజుకు రూ.500 పారితోషికంతో ఐదు రోజులు, 15 రోజుల పాటు శిక్షణ ఇవ్వడంతో పాటు రూ.15వేల వరకు పనిముట్లు అందిస్తారన్నారు. పీఎం విశ్వకర్మ పథకం కింద రుణం ఇస్తారన్నారు. మొదటి విడత రూ.ఒక లక్ష రుణం ఇస్తే ఆ మొత్తాన్ని 18 నెలల్లో తిరిగి చెల్లించాలన్నారు. రెండో విడత రూ.2 లక్షల రుణం ఇస్తారని, దాన్ని 30 నెలల్లో చెల్లించాలన్నారు. ఈ రుణాలకు సంవత్సరానికి 5 శాతం వడ్డీ వసూలు చేస్తారన్నారు. దరఖాస్తులను హెచ్‌టిటిపిః//పీఎంవిశ్వకర్మ.గౌ.ఇన్ పోర్టల్‌లో సీఎస్‌సీ కేంద్రాల్లోగానీ, గ్రామ సచివాలయాల్లోగానీ నమోదు చేసుకోవాలని తెలిపారు.

రూ.1.30 కోట్లతో లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణం



నిర్మాణంలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయం

చెన్నూరు, సెప్టెంబరు 3: మండలంలోని బలసింగాయపల్లెలో రూ.1.30 కోట్లతో నరసింహస్వామి ఆలయ నిర్మాణం జరుగుతోంది. చాలా ఏళ్లుగా గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయం నిర్మాణం చేపట్టాలని ఆ ప్రాంత ప్రజలు నిర్ణయించుకున్నా పలు కారణాలతో నిర్మాణానికి నోచుకోలేదు. ఎట్టకేలకు కొందరు కలిసి తమ వంతుగా రూ.12.70 లక్షలు ప్రభుత్వానికి వాటాగా చెల్లించడంతో అందుకు రూ.50.30 లక్షలు ప్రభుత్వం తన వాటాగా ఇచ్చింది. మొత్తం రూ.63 లక్షలతో పూర్తి గ్రానైట్‌తో ఆలయ నిర్మాణానికి ఈ ఏడాది జనవరి 6న ప్రారంభించారు. కాగా ఆలయ నిర్మాణం పూర్తయ్యేసరికి ప్రహరీతో కలిపి రూ.1.30 కోట్లు ఖర్చు కానున్నట్లు నిర్వాహకులు ఓ.విజయభాస్కర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శివారెడ్డి తెలిపారు. ఇప్పటికే రూ.60 లక్షలు ఖర్చు కాగా మిగలిన రూ.70 లక్షలు దాతల ద్వారా సేకరించి నిర్మాణం పూర్తి చేస్తామన్నారు.

'వైఎస్ఆర్ ఏఎఫ్‌ఏయూ అభివృద్ధికి సహకరించండి'

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 3 : కడప నగరంలో డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్శిటీకి ఎంపీల్యాడ్స్ నిధులను కేటాయించాలని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసరు విశ్వనాధకుమార్ కోరారు. మంగళవారం కడప విమానాశ్రయంలో ఎంపీ సీఎం రమేశ్‌నాయుడును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఎంపీని కలిసి యూనివర్శిటీ ప్రగతిపై చర్చించినప్పుడు తగిన ప్రతిపాదనలతో ముందుకు రావాలని సూచించారన్నారు. దీంతో యూనివర్సిటీకి ప్రధానంగా అవసరమైన ల్యాబ్ నిర్మాణం, నైపుణ్యాలు మెరుగుపరిచేందుకు వీలవుతుందన్నారు. యూనివర్సిటీ నిర్మాణానికి కేటాయించిన 110.36 ఎకరాల స్థలంలో నిర్మాణాలు చేపట్టేందుకు సహకారం అందించాలని ఈ సందర్భంగా కోరారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యకర జీవితం: వైవీయూ వీసీ

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 3 : పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించగలమని వైవీయూ వైస్‌చాన్సలర్ క్రిష్టారెడ్డి తెలిపారు. మంగళవారం వైవీయూ సైన్స్‌బ్లాక్ సెమినార్ హాలులో ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి రామక్రిష్ణ ఆధ్వర్యంలో జాతీయ పోషకాహార వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తక్కువ ఖర్చుతోనే పోషక విలువలు లభించే ఆహార పదార్థాలను వివరించారు. జంక్‌ఫుడ్స్‌కు దూరంగా ఉండాలని సాంప్రదాయ ఆహార పదార్థాలు తీసుకోవాలని తెలిపారు. పోషకాహార లోపం వల్ల ఇప్పటికీ ప్రజలు మృత్యువాత పడుతుండడం బాధాకరమన్నారు. అనంతరం రిజిస్ట్రారు ప్రొఫెసరు రఘునాధరెడ్డి మాట్లాడుతూ పోషకాలు లేని ఆహార పదార్థాలు తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో మాత్రలు తినాల్సి వస్తుందన్నారు.

పని సర్దుబాటు లోపాలను సవరించాలి: ఎస్టీయూ



డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 3 : పని సర్దుబాటు లోపాలు సవరించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇలియాస్‌బాషా, సంఘమేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం డీఈవో కార్యాలయంలో డీఈవో మాధవికి వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ ప్రాథమిక ప్రాథమికోన్నత, జడ్పీ, పురపాలక ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ మండల స్థాయి, డి విజన్ స్థాయి ముగిసిన అనంతరం వివిధ డివిజన్ల పరిధిలో ఏర్పడిన సాంకేతిక సమస్యలు అధికారుల వల్ల జరిగే పొరపాట్ల వల్ల కొంత నష్టం వాటిల్లిందన్నారు. కొన్ని చోట్ల సీనియర్లకు ఆప్షన్లు ఉన్నా బలవంతంగా సర్దుబాటు ప్రక్రియలో పడడం వల్ల నిబందనల మేర కాకుండా నష్టపోయామని తెలిపారు. విచారణ జరిపించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు సురేశ్‌బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలగంగిరెడ్డి పాల్గొన్నారు.

మెంటల్ హెల్త్ కేర్‌లో కార్డియాక్ ప్రోగ్రాం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్, వైద్యులు

కడప (సెవెన్‌రోడ్స్), సెప్టెంబరు 3 :రిమ్స్ ప్రాంగణంలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్‌లోని అనస్తీషియాలజీ విభాగం మంగళవారం ఏసీఎల్ఎస్ కా ర్యక్రమాన్ని నిర్వహించింది. ప్రి న్సిపాల్ డాక్టర్ సురేఖ, స ర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి ప్రముఖ వైద్యులు డాక్టర్ సురేశ్వరరెడ్డి, డాక్టర్ విజయ్‌భాస్కర్‌రెడ్డి, డాక్టర్ వెంకట్రాముడు, డాక్టర్ సునీల్ చిరువెళ్ల హాజరయ్యారు. ఈ కార్యక్రమం రెండు రోజుల పాటు కొనసాగుతుంది. ఇందులో పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు పాల్గొంటారు. క్లిష్టమైన స్థితిలో ఉన్న రోగులకు ప్రాణాలు కాపాడే అధునాతన కార్డియాక్ లైఫ్ సపోర్ట్‌స్కిల్స్‌పై అవగాహన కల్పించారు.

'భవిష్యత్తులో అడ్డంకులు లేకుండా చూడాలి'



పులివెందులలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న దండు వీరయ్య

పులివెందుల రూరల్, సెప్టెంబరు 3: భవిష్యత్తులో ఎస్సీ వర్గీకరణకు అడ్డంకులు లేకుండా శాశ్వత పరిష్కార మార్గాన్ని చూడాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం పట్టణంలోని మిట్ట మల్లేశ్వరస్వామి కల్యాణ మండపంలో జిల్లా ఉపాధ్యక్షుడు రామయ్యగారి కృష్ణమూర్తి అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ర్యాలీగా సమావేశస్థలానికి వచ్చారు. జిల్లా ఉపాధ్యక్షులు రామయ్యగారి కృష్ణమూర్తి, డప్పు, చర్మ కారుల రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం, మాదిగ కాంట్రాక్టు ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ పెదనపాటి శివరాం, జిల్లా ఉపాధ్యక్షులు సహదేవుడు, జిల్లాకార్యదర్శి పుల్లయ్య, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, మండలాల నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యకరం

వేముల, సెప్టెంబరు 3: ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యకరమని ప్రకృతి వ్యవసాయ అడిషనల్ డీపీఎం వసంతకుమారి తెలిపారు. ఎస్సీపురంలో మండల స్థాయి సిబ్బందితో అడిషనల్ డీపీఎం వసంతకుమారి సమావేశం నిర్వహించారు. మహిళలు కషాయాలు ద్రావణాలు తయారుచేసి ఉపయోగలనువివరించారు. ఇంటి వద్దపెరటి తోటలు వేసుకోవాలన్నారు.

నిరుద్యోగ యువతకు ప్రభుత్వం భరోసా

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 3 : నిరుద్యోగ యువతకు కొప్పర్తి పరిశ్రమ భరోసాగా ఉందని, సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తూనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేశ్ తెలిపారు. మంగళవారం కొప్పర్తి పారిశ్రామికవాడను టీఎన్ఎస్ఎఫ్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ అభివృద్ధికి కేంద్రం, రాష్ట్రం కట్టుబడి ఉందన్నారు. కొప్పర్తికి ఇండస్ట్రియల్ మార్క్‌సిటీ మంజూరు ఇందుకు నిదర్శనమన్నారు. ఎన్నికల హామీ మేరకు చంద్రబాబు కొప్పర్తి పారిశ్రామికవాడ అభివృద్ధి చేసి యువతకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటారని గుర్తు చేశారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్‌నాయకులు భరత్ సింహ, ఫరీద్, కేశవ, క్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించండి

కడప (నాగరాజుపేట), సెప్టెంబరు 3:ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో అదనపు డీఎంహెచ్‌ఓ అధికారి ఉమామహేశ్వర్‌రావుకు ఆయన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒప్పంద జీఓలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

గర్భిణుల నమోదు తప్పనిసరిగా చేయాలి

వల్లూరు, సెప్టెంబరు 3: తమ పరిధిలో ఉండే ఆశావర్కర్లు తప్పనిసరిగా గర్భవతుల నమోదు తప్పనిసరిగా చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం వల్లూరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆశా వర్కర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆశా వర్కర్ తమ గ్రామ పరిధిలోని గర్భవతులు, బాలింతలకు సంబంధించి పేర్లను నూరు శాతం ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

సింహాద్రిపురం, సెప్టెంబరు 3: చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఏసీడీఎస్ సూపర్‌వైజర్ వసంత సూచించారు. ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా అంకాళమ్మగూడూరులోని అంగన్‌వాడీ సెంటర్లలో రక్త హీనత గురించి వివరించి, ఏఎన్ఎమ్‌తో రక్త పరీక్షలు నిర్వహించారు.

కాండం తొలుచు పురుగును నివారిద్దాం

పెండ్లిమర్రి, సెప్టెంబరు 3: ప్రస్తుతం వరిపంటకు కాండం తొలుచు పురుగు ఆశించినందున తక్షణ నివారణచర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ఓబులేసు తెలిపారు. మంగళవారం నందిమండలం గ్రామం లో సాగులో ఉన్న వరి పంటను ఆయన పరిశీలించారు. కాండం తొలుచుపురుగు నివారణ కు ప్రొఫినోపాస్‌ఒక లీటర్ 2ఎంఎల్ మరియు 19:19:19 ఒక లీటరునీటికి 10గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు.

యాచకులకు అన్నదానం

కమలాపురం రూరల్, సెప్టెంబరు 3:కమలాపురం నగర పంచాయతీలో యాచకులకు అన్నదానం చేశారు. మంగళవారం బైబిల్ వండర్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ జాన్‌వెస్లీ పుట్టినరోజు సందర్భంగా కన్వీనరు, టీం సభ్యులు, అభి చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ డాక్టర్ ఎన్.విజయబాబు ఆధ్వర్యంలో రోడ్డు పక్కన, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు తదితర ప్రాంతాల్లో భిక్షాటన చేసుకుంటూ జీవనం చేస్తున్న వారికి అన్నదానం చేశారు.

క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత శిఖరాలు: ప్రిన్సిపాల్

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 3 : క్రమశిక్షణ, పట్టుదలతోనే జీవితంలో ఉన్నత శిఖరాలు సాధించగలమని ప్రిన్సిపాల్ సలీంబాషా అన్నారు. మంగళవారం ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్టూడెంట్ ఇండక్షన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులు ఎలా ఉం డాలో జీవితంలో ఎలా ఎదగాలో వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీరామరెడ్డి, అకడమిక్ కో ఆర్డినేటరు నాగమునిరెడ్డి, డాక్టర్ సీవీ క్రిష్ణవేణి, బోటనీ లెక్చరర్ సుబ్రమణ్యం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటరు ప్రకాశ్ నారాయణరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రాచీన శాసనానికి పట్టం కట్టిన కలెక్టర్



కలెక్టర్‌ను సన్మానిస్తున్న డీఈఓ తదితరులు

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 3 : తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా కలమల్లలో జరిగిన వేడుకలను అంగరంగవైభవంగా నిర్వహించడంలో క్రియాశీలక పాత్ర పోషించిన కలెక్టరు శివశంకర్‌ను తెలుగుభాషోత్సవ నిర్వహణ కమిటీ ఘనంగా సత్కరించింది. మంగళవారం కలెక్టరు బంగ్లాలో డీఈఓ అనురాధ ఆధ్వర్యంలో కమిటీ కలెక్టరును సన్మానించారు. కమిటీ సమన్వయ కర్తలు మేరీ, పాలెం మహేశ్‌బాబు మాట్లాడుతూ క్రీస్తు 575 సంవత్సరంలో రేనాటి చోళరాజు ధనుంజయుడు వేయించిన కలమల శాసన వైభవాన్ని కలెక్టరు గుర్తించి కలమలకు పూర్వవైభవం తీసుకువచ్చారన్నారు.

ఘనంగా శ్రీకృష్ణుడి ప్రతిమ ఊరేగింపు



పులివెందుల, సెప్టెంబరు 3: త్రైత సిద్ధాంత ప్రబోధసేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక పులివెందుల కమిటీ ఆధ్వర్యంలో పులివెందులలో శ్రీకృష్ణుడి ప్రతిఊరేగింపు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పులివెందులకమిటీ అధ్యక్షుడు వరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఆగస్టు 26న సోమవారం శ్రీకృష్ణజన్మాష్టమి రోజున అంకాళమ్మగుడి వద్ద కిలువుతీర్చిప్రతిరోజు నిత్య పూజలు, భగవద్గీత శ్లోకపారాయణం చేశామన్నారు. మంగళవారం శ్రీకృష్ణుడి ప్రతిమను ఊరేగించరు. అంకాళమ్మ ఆలయం నుంచి పార్నపల్లెరోడ్డు, పూలంగళ్ల సర్కిల్, ముత్యాలవారివీధి, అమ్మవారిశాల వీధి, వేంకటేశ్వరస్వామి ఆలయం, సత్రంబడి మీదుగా అంకాళమ్మ ఆలయం వరకు అంగరంగవైభవంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణాలయం వ్యవస్థాపక సభ్యుడు ధరణి రమణ, పలువురు టీడీపీ నేతలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విజయవాడ విపత్తును జాతీయ విపత్తుగా ప్రకటించాలి: తులసిరెడ్డి

వేంపల్లె, సెప్టెంబరు 3: విజయవాడ విపత్తును జాతీయ విపత్తుగా కేంద్రం ప్రకటించాలని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ నేత ఎన్.తులసిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విజయవాడ విపత్తు బాధాకరం, దురదృష్టకరమన్నారు. 19మంది మృతి, ఇద్దరు గల్లంతు, 136 పశువులు మృతి, 9700 కోళ్లు మృతి, 4.26లక్షల ఎకరాలలో వరిపంట, 39964 ఎకరాలలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయన్నారు. 1808 కిలోమీటర్ల రోడ్లు దెబ్బతిన్నాయి, 73 చెరువులకు గండ్లు పడ్డాయన్నారు. ఇంకా 2.5లక్షల మంది ముంపు ప్రాంతాలలోనే ఉన్నారన్నారు. ప్రస్తుత పునరావాస కార్యక్రమాలుమ్మురంగా సాగుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులు నిర్విరామంగా సహాయ కార్యక్రమాలలో పాల్గొంటున్నారన్నారు.

వరి కొనలు తుంచి నాటితే ఉపయోగం : ఏడీఏ

కమలాపురం రూరల్, సెప్టెంబరు 3 :రైతులు వరి నాటే సమయంలో కొనలను తుంచి నాటితే ఉపయోగకరంగా ఉంటుందని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని గొల్లపల్లె గ్రామంలో సాగు చేసిన వరి పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనలు తుంచి నాటడం వల్ల కాండం తొలిచే పురుగును గుడ్డు దశలోనే నివారించవచ్చన్నారు. వరిలో తప్పనిసరిగా 2 మీటర్లకు గాను 30 సె.మీ కాలిబాటలు వదులుకుని నాటుకుంటే సుడిదోమను నివారించవచున్నారు. రైతులు ఎరువుల యాజమాన్యాన్ని చేపట్టాలని, కాంప్లెక్స్ ఎరువులను ఎట్టి పరిస్థితుల్లోనూ పైపాటుగా వినియోగించరాదన్నారు. పంటకు యూరియాను మూడు విడతలుగా వేసుకోవాలన్నారు. పొటాష్ ఎరువులను నాటే సమయంలో మొత్తం వేసుకోవాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి సరస్వతి, వ్యవసాయ విస్తరణ అధికారి, దస్తగిరి, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

కష్టార్జితుల కల్పవల్లి.. మరియ తల్లి



మరియ తల్లి ఊరేగింపులో పాల్గొన్న విశ్వాసులు

కడప (కల్చరల్), సెప్టెంబరు 3: కష్టాలు, ఆపదలో ఉన్న వారికి తాను న్నానంటూ భరోసా అందిస్తూ వారి జీవితాలలో వెలుగులు నింపే కల్పవల్లి మరియతల్లి అని పలమనేరు డీన్ ఫాదర్ సుమన్, పీలేరు విచారణ ఫాదర్ జాన్ కొనియాడా రు. ఆరోగ్య మాత ఉత్సవాలను పురష్కరించుకుని ఆరవ రోజైన మంగళవారం స్థానిక కడప రైల్వేస్టేషన్ సమీప ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో ఇరువురు ఫాదర్లు పాల్గొన్నారు. ఇందులో సుమన్ దివ్యబలిపూజను సమర్పించగా జాన్ మరియమాత సందేశాన్ని వినిపించారు.

చవితికి సిద్ధమైన బొజ్జ గణపయ్యలు



సినీహబ్ వద్ద విక్రయానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 3: వినాయక చవితి ఉత్సవానికి వీధి వీధినా వివిధ రూపాల్లో బొజ్జగణపయ్యలు కొలువుదీరనున్నారు. పండుగకు కొద్దిరోజుల సమయం ఉండడంతో వినాయక విగ్రహాలు తరలింపునకు సిద్ధమయ్యాయి. పట్టణంలో దాదాపు 900 విగ్రహాలను కొలువుదీర్చి పూజలు నిర్వహించనున్నారు. పండుగకోసం ఒక అడుగు నుంచి 15 అడుగుల వరకు ఉన్న విగ్రహాలను విక్రయాలకు సిద్ధంగా ఉంచారు. పట్టణంలో 13 ప్రాంతాల్లో వినాయక విగ్రహాలనువిక్రయిస్తున్నారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు డబ్బులిచ్చి విగ్రహాలను తీసుకెళుతున్నారు. వెయ్యి రూపాయల నుంచి లక్ష వరకు విగ్రహాల ధర ఉంది.

● **వివిధ రూపాల్లో గణనాథులు...:** వివిధ రూపాల్లో వినాయకుని విగ్రహాలను తయారు చేయడంలో ఇక్కడి కళాకారులు పేరుపొందారు. విఘ్నగణపతి, బ్రహ్మ, విష్ణు, మహేశ్వర గణపతి, సింహవాహన, గజవాహన, మూషిక వాహన, రాధాకృష్ణ గణపతి, వేంకటేశ్వర, శివపార్వతుల గణపతుల విగ్రహాలను ఆకర్షణీయంగా రూపొందించారు. ఇక్కడ తయారైన విగ్రహాలను కడప, రాజంపేట, మైదుకూరు, జమ్మలమడుగు, వేంపల్లె, ఎర్రగుంట్ల, చాగలమర్రి, చుట్టుపక్కల పల్లె ప్రాంతాలకు తరలి వెళ్లనున్నాయి. కొందరు వ్యాపారులు నెల్లూరు, హైదరాబాదు నుంచి విగ్రహాలను తెచ్చి వ్యాపారం నిర్వహిస్తున్నారు.

● **మట్టి విగ్రహాలు పర్యావరణ హితం..:** ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహలను పూజించడం వలన పర్యావరణం దెబ్బతింటుందని అందువలన మట్టి విగ్రహాలను పూజించాలని ప్రభుత్వం సూచిస్తోంది. మట్టి విగ్రహాల ఏర్పాటుపై ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ప్రజలను చైతన్యం చేస్తున్నాయి. దీంతో ప్రజలు మట్టి విగ్రహాలను పూజించడానికి ఆసక్తి చూపిస్తున్నారు. పట్టణంలో కుమ్మరకొట్టాలు, కొర్రపాడు రోడ్డు, మైదుకూరు రోడ్డు, ఈశ్వర్‌రెడ్డినగర్ ప్రాంతాల్లో దాదాపు 20 కుటుంబాలు మట్టి విగ్రహాలు తయారు చేసి ఉపాధి పొందుతున్నాయి. మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని వారు పేర్కొంటున్నారు.

వినాయక మండపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి

మైలవరం, సెప్టెంబరు 3: వినాయక చవితికి మండపాలు నిర్వహించే వారు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని మైలవరం ఇన్‌చార్జ్ ఎస్ఐ లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం మైలవరం పోలీస్ స్టేషన్ పరిధి గ్రామాల పెద్దలు, పీస్ కమిటీ మెంబర్స్‌తో స్టేషన్ ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేడుకలు ఘర్షణలు, సమస్యలకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. మండపాల వద్ద ఎక్కువ శబ్ద కాలుష్యం చేసే స్పీకర్లను ఉపయోగించరాదన్నారు. విగ్రహాలకు భద్రతగా కమిటీ సభ్యులు రాత్రుళ్లు మండపాల వద్దనే ఉండాలన్నారు.వినాయక చవితి నిర్వహణ పట్ల పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

జమ్మలమడుగు, సెప్టెంబరు 3: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, మట్టి వినాయక విగ్రహాలనే ఏర్పాటు చేయాలని జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రఫిక్‌పాషా సూచించారు. మంగళవారం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ ముద్రించిన మట్టి గణపతులను ప్రతిష్టిద్దాం అనే పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు కె.ప్రసాద్, నూరి, నరసింహ, పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కుందూనదిని పరిశీలించిన అధికారులు

చాపాడు, సెప్టెంబరు 3: మండలంలోని సీతారామపురం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూనదిని తహసీల్దారు రవీంద్రారెడ్డి, ఎస్ఐ చిన్నపెద్దయ్య, ఈవోపీఆర్డీ క్రిష్ణవేణి మంగళవారం పరిశీలించారు. వినాయక చవితి పండుగకు విగ్రహాలు నిమజ్జనం చేసేందుకు ఈ గ్రామం వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. నది వద్ద బారికేడ్లు, లైట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆరోజు నుంచి నిమజ్జనం పూర్తయ్యే వరకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

విద్యార్థికి ఆర్థికసాయం

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 3 : ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న కుండా హర్షాకు తొగట వీర క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో రూ.20 వేలు ఆర్థికసాయం అందజేశారు. మంగళవారం తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఆర్థికసాయం విద్యార్థి తండ్రికి అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రతిభావంతులైన పేద విద్యార్థులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో విద్యార్థి కళాశాల ఫీజుకు అవసరమైన మొత్తాన్ని ఆర్థికసాయంగా అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి చౌడం వెంకటరమణ, కోశాధికారి గంజికుంట అంజనేయులు, ఉపాధ్యక్షులు ఉమ్మడిశెట్టి చౌడయ్య, బొలిశెట్టి రామయ్య, బాణా మునెయ్య, తదితరులు పాల్గొన్నారు.

భూసమస్య పరిష్కారం

చాపాడు, సెప్టెంబరు 3: మండలంలోని చిన్నగురవలూరు గ్రామంలో అయిదేళ్ల నుంచి ఇద్దరి రైతుల మధ్య పెండింగ్‌లో ఉన్న భూ సమస్యను మంగళవారం పరిష్కరించినట్లు జిల్లా సర్వేయర్ మురళీకృష్ణ తెలిపారు. ఆ గ్రామానికి చెందిన పాలగిరి శివారెడ్డి, ఇటీవల కలెక్టర్ శివశంకర్‌కు తన భూమి అదే గ్రామానికి చెందిన జంబార పు ఏసోబు ఆక్రమించినట్లు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశాడన్నారు. శివారెడ్డికి సర్వే నంబరు 233-2లో 3.50 ఎకరాల భూమి ఉందన్నారు. ఇందులో 17 సెంట్లు ఆక్రమణకు గురైందని ఫిర్యాదు చేశాడన్నారు. ఈ భూమి అంతటిని కొలిచి సర్వే హద్దులు సూచించినట్లు పేర్కొన్నారు. ఇద్దరి రైతుల మధ్య అంగీకారంతో సమస్యను పరిష్కారం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు డివిజన్ సర్వేయర్, మండల సర్వేయర్ సాయిలత, డిప్యూటీ తహసీల్దారు ప్రవీణ్‌కుమార్, పోలీసులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 3 :జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న టీం వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయకుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వద్ద వేతన బకాయిలు చెల్లించాలని ఆందోళన చేశారు. బకాయిలు వెంటనే కార్మికులకు చెల్లించాలని, లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

14న లోక్‌అదాలత్

బద్వేలు రూరల్, సెప్టెంబరు 3 : ఈ నెల 14న నిర్వహించబోయే లోక్ అదాలత్‌లో అధిక కేసులు పరిష్కరించి జయప్రదం చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్.బాబా ఫక్రుద్దీన్, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వైజే పద్మశ్రీ, జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక కోర్టులో పోలీసు అధికారులు, బార్ అసోసియేషన్ న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్‌లో న్యాయపరిష్కారం చేయడానికి కక్షిదారులతో మాట్లాడి రాజీ చేసి అధిక కేసులు పరిష్కరించాలన్నారు. అనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ బాబా ఫక్రుద్దీన్ బద్వేలు సబ్ జైలును పరిశీలించారు. కార్యక్రమంలో పోలీసులు, బార్ అసోసియేషన్ న్యాయవాదులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

జమ్మలమడుగు, సెప్టెంబరు 3: జమ్మలమడుగు మండలంలోని ముద్దనూరు రోడ్డులో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ సురేంద్రనాథరెడ్డి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సిడాప్, డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆధ్వర్యంలో ఈ జాబ్‌మేళా నిర్వహించినట్లు తెలిపారు. ఇలాంటి జాబ్‌మేళాలు ప్రతినెల జిల్లాలోని ప్రతి ఒక్క నియోజకవర్గంలో జరుగుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమానికి సంస్థల ప్రతినిధులు ముగ్గురు హాజరయ్యారన్నారు. 141 మంది అభ్యర్థులు హాజరుకాగా అందులో 76 మంది ఎంపికయ్యారని ఆయన తెలిపారు.

జగన్ ఇంగిత జ్ఞానం ఉండే మాట్లాడుతున్నాడా..?

ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి



ప్రొద్దుటూరు, సెప్టెంబరు 3 : ఎగువ శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల్లో నీళ్ల నిలబెట్టి వుంటే విజయవాడలో ఇంత ముంపు జరిగేది కాదని జగన్‌మోహన్‌రెడ్డికి కనీస ఇంగిత జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి విమర్శించారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వరదల వల్ల ప్రాజెక్టులు నిండిపోయి ప్రమాద స్థాయికి చేరుకుంటే ప్రాజెక్టుల్లో నీళ్ల నిలబెట్టి వుంటే విజయవాడకు ఈ ముంపు ప్రమాదం తప్పేదని జగన్ చెప్పడం బాధ్యతారహితంగా వుందన్నారు. ప్రాజెక్టులు తెగిపోయి వుండి ఈ రాష్ట్రం అతలాకుతలం కావాలని జగన్ లాంటి వారే కోరుకుంటారన్నారు. ఈ రాష్ట్ర ప్రజల దురదృష్టం కొద్ది జగన్ను ఎన్నుకోవడం వలన ఐదేళ్లుగా ముఖ్యమంత్రిగా భరించాల్సి వచ్చిందన్నారు. విజయవాడలో వరదసహాయ పనులు స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అక్కడే వుండి పర్యవేక్షిస్తుంటే ప్రతిపక్షంలో వున్న జగన్ కనీసం అక్కడ బాధితులను పరామర్శించకుండా వారిని పార్టీ తరుపున ఆదుకోకుండా బాధ్యతలేని విమర్శలు చేస్తున్నారన్నారు.ప్రకాశం బ్యారేజీ వద్ద 11.49 లక్షల క్యూసెక్కుల నీళ్ల వదులుతుంటే వాటిని ప్రాజెక్టుల్లో నిలపమనే అజ్ఞాని జగన్ అన్నారు. ఇలాంటి వారిని భవిష్యత్తులో మళ్లీ రాజకీయాల్లోకి రానీయకూడదన్నారు. సమావేశంలోపట్టణ టీడీపీ అధ్యక్షుడు ఈవీ సుధాకర్ రెడ్డి, పట్టణ మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు,తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, మాజీ కౌన్సిలర్ తలారి పుల్లయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు విద్యార్థులు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 3 : ఎస్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు 8 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పాండురంగన్‌రవి తెలిపారు. కళాశాలలో బెంగళూరుకు చెందిన క్యూలింక్ బిజినెస్ కన్సల్టెంట్ బీటెక్ చివరి సంవత్సరం విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. సివిల్, మెకానికల్ విభాగం వారికి డిజైన్ ఇంజనీరింగ్ ఉద్యోగాలకు నిర్వహించిన ఎంపికల్లో సతీష్, నర్మద, సుమంత్‌రెడ్డి, చంద్రిక, శివాంజనేయులు, సుచిత్ర, లహరి, శ్రావణ్‌కుమార్‌రెడ్డి ఎంపికయ్యారు. ఈ విద్యార్థులకు సంవత్సరానికి రూ.3 నుంచి రూ.4 లక్షల వేతనం లభిస్తుందని తెలిపారు.విద్యార్థులను ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ వీరకల్యాణ్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

ఎమ్మెల్యే వరదపై విమర్శలు హాస్యాస్పదం

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 3 : ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డిపై మున్సిపల్ చైర్మన్ బంగారురెడ్డి విమర్శలు హాస్యాస్పదమని టీడీపీ నాయకుడు పగిడాల దస్తగిరి విమర్శించారు. మంగళవారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా చేసినట్లు బంగారురెడ్డి స్వయంగా ఒప్పుకున్నారన్నారు. బంగారురెడ్డి ఎమ్మెల్యేపై ఇసుక, మట్కా, గుట్కా ఆరోపణలు చేయడం దారుణమన్నారు. వైసీపీ పాలనలోనే మట్కా, గుట్కా, బెట్టింగ్‌లు జరిగాయని విమర్శించారు. జార్జ్‌క్లబ్‌లో రిటైర్డు ఉద్యోగులు సరదాగా పేకాట ఆడితే వారిని కూడా విమర్శించడం దారుణమన్నారు. నందం సుబ్బయ్య హత్యలో బంగారురెడ్డి తన ప్రమేయం లేదని కాణిపాకంలో ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. వైసీపీ పాలనలోనే జూదం విచ్చలవిడిగా జరిగిందని, బంగారెడ్డి నివాసం జూదానికి నిలయమని విమర్శించారు. బంగారురెడ్డి అవినీతి, అక్రమాల వల్లే రాచమల్లు ఓడిపోయారని ఆరోపించారు. కార్యక్రమంలో నాగరాజు పాల్గొన్నారు.

అవినీతి మచ్చలేని నాయకుడు వరద



మాట్లాడుతున్న మాదాసు మురళి

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 3 : ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి రాజకీయ జీవితంలో ఎటువంటి అవినీతి మచ్చలేదని జనసేన పార్టీ నాయకుడు మాదాసు మురళి పేర్కొన్నారు. మంగళవారం జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ వైస్‌చైర్మన్ బంగారురెడ్డి ఎమ్మెల్యేపై మట్కా, గుట్కా, ఇసుక అక్రమ రవాణా గురించి ఆరోపించడం తగదని అవన్నీ వైసీపీ పాలనలో విచ్చలవిడిగా జరిగాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లం చంద్రశేఖర్, బాలభాస్కర్‌రెడ్డి, కేశవ, హరీష్, మహబూబ్‌బాష, రఫిక్ పాల్గొన్నారు.

నిత్యావసర ధరలు తగ్గించాలి : సీపీఐ



పోరుమామిళ్లలో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

పోరుమామిళ్ల, సెప్టెంబరు 3 : నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు వీరశేఖర్ తెలిపారు. పోరుమామిళ్ల ఆర్టీసీ బస్టాండు ఆవరణంలో తలపై కూరగాయల బుట్ట, మోకాళ్లపై అర్ధనగ్న నిరసన తెలిపారు. మోదీ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో విఫలమైందని అన్నారు. రోజురోజుకూ నిత్యావసర ధరలు పెరిగిపోతుంటే సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్యాస్, డీజలు ధరలు పెరుగుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల నిత్యావసరవస్తువులు ఇవ్వాల్సిన ప్రభుత్వాలు కేవలం నాశిరక బియ్యం పంపిణీతో సరిపెడుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పిడుగు మస్తాన్, రవికుమార్, జాకోబ్, ఫిరోజ్, అబ్దుల్లా, చంద్ర, షాహిదా తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

జమ్మలమడుగు, సెప్టెంబరు 3: జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయం ఎదురుగా మంగళవారం సీపీఐ కార్యదర్శి ప్రసాద్ తదితరుల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్రమోదీ వంద రోజుల్లో అధిక ధరలు తగ్గిస్తానని చెప్పడం జరిగిందన్నారు. పెరుగుతున్న ధరలను అదుపు చేయడంలో విఫలం అయ్యారన్నారు. అధిక ధరలను అదుపు చేయలేని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును నిరశిస్తూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఏవో తిరుపతయ్యకు వినతి పత్రాన్ని వారు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సుమన్, రాంప్రసాద్, నారాయణ, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్ష ఫలితాల పత్రాలు పంపిణీ



జమ్మలమడుగు, సెప్టెంబరు 3: రైతులకు భూసార పరీక్ష పత్రాలు మంగళవారం గూడెం చెరువులో వ్యవసాయాధికారులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జమ్మలమడుగు వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రైతుల పొలాల్లో మట్టి నమూనాలను సేకరించామన్నారు. భూసార పరీక్ష కేంద్రానికి పంపి వాటి పత్రాలను రైతులకు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్రీకాంత్, శివశంకర్, రైతులు పాల్గొన్నారు.

భూకబ్జాదారులపై పీడీ యాక్టు నమోదు చేయాలి

పోరుమామిళ్ల, సెప్టెంబరు 3 : భూకబ్జాదారులపై పీడీ యాక్టు నమోదు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం సీపీఎం మండల కమిటీ కార్యదర్శి భైరవప్రసాద్ ఆధ్వర్యంలో పోరుమామిళ్లలో శాస్త్రీయ రాజకీయ శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలముందు టీడీపీ భూకబ్జాదారులపై కేసులు నమోదు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక మిన్నకున్నారన్నారు. సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యులు రామ్మోహన్, కమిటీ సభ్యులు గౌసియాబేగం పాల్గొన్నారు.

పిట్టిగుంటలో కొత్తమోటారు ఏర్పాటు

కాశినాయన, సెప్టెంబరు3: పిట్టిగుంట గ్రామంలో నాలుగు సంవత్సరాలుగా తాగునీటి మోటారు చెడిపోయి పనికిరాకుండా పోయింది. దీంతో ప్రస్తుతం గ్రామంలో ఉన్న ఒక్కగానొక్క తాగునీటి మోటారు చెడిపోతే మరమ్మతులు చేయించేంతవరకు తాగునీటికి కొంత ఇబ్బందిగా ఉండేది. సమస్యను గుర్తించిన సర్పంచ్ ముమ్మడిరెడ్డి జయమ్మ మంగళవారం గ్రామంలో దాదాపు రూ.లక్ష ఖర్చుతో కొత్త మోటారు,పైపులు, స్టాటరు ఏర్పాటుచేశారు.

డ్రైనేజీ కాల్వల మరమ్మతులు

పోరుమామిళ్ల, సెప్టెంబరు 3 : పోరుమామిళ్లలో శీనప్పబావి వద్ద శివాలయం ఎదురుగా ఉన్న డ్రైనేజీ ఇటీవల కురిసిన వర్షానికి నీరు నిల్వ ఉండడమే కాకుండా డ్రైనేజీ కాల్వలు దెబ్బతినడంతో సర్పంచ్ యనమల సుధాకర్ వాటి మరమ్మతులు చేయించారు. అలాగే శీనప్పబావి వీధిలో మోటారు మరమ్మతులు చేయించి తాగునీరు సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలి

బద్వేలు రూరల్, సెప్టెంబరు 3 : గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు రక్తహీనత నివారించేందుకు పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టరు శ్రీలక్ష్మి కోరారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా అర్బన్ హెల్త్ సెంటరు, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని రామ్‌నగర్ అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న మునగాకు, గోంగూర, నిమ్మజాతి పండ్లను ప్రతిరోజూ ఆహారంలో తీసుకోవడం ద్వారా రక్తహీనత నివారించవచ్చున్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఇచ్చే పాలు, గుడ్లు, బాలసంజీవని, తల్లులు మాత్రమే వినియోగించేలా అవగాహన కలిగించాలన్నారు. అనంతరం నియోజకవర్గంలోని కొండూరు, ఐత్రంపేట అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో శ్రీదేవి, సూపర్‌వైజరు సుబ్బలక్షుమ్మ, ఏఎన్ఎంలు, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారలోపం లేకుండా చూడాలని ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి అన్నారు. మంగళవారం పోరుమామిళ్ల మండలం టేకూరుపేట సెక్టారులో సిద్దవరం అంగన్వాడీ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. సిద్దవరం మెయిన్ అంగన్వాడీ కేంద్రం పరిధిలో గర్భిణీలు, బాలింతలకు అంగన్వాడీ కేంద్రంలో పండించిన ఆకుకూరలు, కూరగాయాలు పంపిణీ చేశారు. అనంతరం పోషణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం సిద్దవరం హరిజనవాడలో హెల్త్ డిపార్ట్‌మెంటుతో కలిసి అనీమియా పరీక్షలు నిర్వహించారు.కార్యక్రమంలో పోరుమామిళ్ల ఐసీడీఎస్ అధికారి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య సమస్యలపై ఉద్యమం

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 3 : మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీ వరకు వైద్య, ఆరోగ్య సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం నిర్వహిస్తున్నట్లు ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం పేర్కొన్నారు. ఎంపీజే కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య పరంగా ప్రజలకు ఇస్తున్న ఆరోగ్య, సీఎం రిలీఫ్ ఫండ్‌ను అర్హులైన పేదలందరికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ, ఏరియా, జిల్లా ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యసౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీజే జిల్లా అధ్యక్షుడు జాకీర్ ఉమ్మి, పట్టణాధ్యక్షుడు హుస్సేన్‌బాష, కార్యదర్శి మహమ్మద్‌రఫి, పాల్గొన్నారు.

రైతులు వరిలో కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలి



వరిపైరును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

బి.కోడూరు, సెప్టెంబరు 3 : వరి సాగు చేసిన రైతులు తప్పనిసరిగా కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి నాగేశ్వర్‌రావు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని పాయల కుంట్ల గ్రామంలో వరి పొలాలను పరిశీలించి రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు వరిలో కాలిబాటలు తీసుకోవాలని, జిగురు అట్టలు పెట్టుకోవాలని అదే విధంగా సాగు చేసిన ప్రతి పంటను ఈ-పంట చేసుకోవాలని వారన్నారు. అనంతరం ఐత్రంపేట రైతు సేవా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. పోరుమామిళ్ల డివిజను వ్యవసాయ సంచాలకులు మురళీధర్‌రెడ్డి, వ్యవసాయ సిబ్బంది బ్రహ్మానందరెడ్డి, చెన్నారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కుందూ తీరం.. పచ్చదనం



కళకళలాడుతున్న వరిపైరు

రాజుపాలెం, సెప్టెంబరు 3 : కుందూ పరవళ్లు, కమ్ముకున్న కారు మబ్బులు, చల్లని వాతావరణంలో పచ్చదనంతో వరి పైరు కళకళలాడుతోంది. నాలుగురోజులుగా వర్షాలు పడుతుండంతో పంటలు పచ్చదనం పరచుకుని కోనసీమ అందాలు తలపిస్తున్నాయి. కుందూ వెంబడి టంగుటూరు, తొండలదిన్నె, వెలవలి, కూలూరు, దద్దనాల తదితర ప్రాంతాల్లో 20 రోజులుగా వరి నాట్లు వేస్తుండడంతో కుందూ పచ్చదనంగా మారింది. గతంలో రెండేళ్లుగా సరైన వర్షాలు లేక నీరు కూడా లేకపోవడంతో వరి పైరుకు స్వస్తి చెప్పేపరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు సకాలంలో వర్షాలు పడి జలాశయాలు నిండుకుండలా ఉండడంతో పాటు నీరు సమృద్ధిగా వస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీంతో రైతులు పంట పొలాలు చూసుకుంటూ తమ పనుల్లో నిమగ్నమయ్యారు. తొండలదిన్నె నుంచి వెలివలి వరకు రోడ్డుకు ఇరుపక్కలా వరినాట్లు పచ్చదనంగా ఉండడంతో చూపరులకు కనువిందు చేస్తున్నాయి.

ఇంటర్నేషనల్ బుక్ రికార్డ్స్‌లో మైదుకూరు చిన్నారికి చోటు

31 రోజులకే ఆధార్



ఒంటేరు గీతహరిణి

మైదుకూరు రూరల్, సెప్టెంబరు 3: కడప జిల్లా మైదుకూరుకు చెందిన చిన్నారికి ఇంటర్నేషనల్ బుక్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. పుట్టిన 31 రోజులకే ఆధార్ తీసుకోవడంతో ఈ ఘనత లభించింది. వివరాలిలా.. మైదుకూరుకు చెందిన సుదర్శన్, ప్రసన్న దంపతులకు పాప పుట్టింది. ఈ పాపకు ఒంటేరు గీతహరిణి అని పేరు పెట్టి ఆధార్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీంతో పాప పుట్టిన 31 రోజులకే ఆధార్ వచ్చింది. వృత్తిరీత్యా ఫ్రిడ్జ్ మెకానిక్ షాప్‌తో జీవనం సాగించే సుదర్శన్.. ఇంత చిన్న వయసులో ఎవరికైనా ఆధార్ నెంబర్ వచ్చిందా అని ఆన్‌లైన్‌లో పరిశీలించారు. గతంలో తెలంగాణకు చెందిన 52 రోజుల చిన్నారికి ఆధార్ వచ్చిన విషయం తెలుసుకున్నారు. వెంటనే తమ కుమార్తె వివరాలను ఆన్‌లైన్ ద్వారా ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డు, వరల్డ్ రికార్డ్స్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ వారికి పంపారు. వారు 'యంగెస్ట్ గర్ల్ ఆధార్‌కార్డ్ హోల్డర్'గా ఒంటేరు గీతహరిణిని గుర్తించారు. ఈ మేరకు వారు పంపిన ప్రశంసా పత్రం మంగళవారం పోస్టుద్వారా వీరికి చేరింది. తమ కుమార్తెకు ఈ ఘనత రావడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.